

కూలిపోయేందుకు సిద్ధంగా ఉన్న బీటీ రోడ్డు

నాణ్యతకు తిలోదకాలు

- గిరిశిఖర గ్రామాల్లో అధ్వానంగా రోడ్ల నిర్మాణం
- నెలల వ్యవధిలోనే బీటలు వారి.. కోతకు గురైన వైనం
- కొన్నిచోట్ల ప్రారంభానికి ముందే ధ్వంసం
- కొరవడిన అధికారుల పర్యవేక్షణ
- కేంద్ర సర్కారు నిధులతో పనులు.. దృష్టి సారించని గత వైసీపీ ప్రభుత్వం
- పెదవి విరుస్తున్న గిరిజనులు
- నూతన ప్రభుత్వం స్పందించాలని విన్నపం



కాలువలు లేని తోణాం దిగువశెంబి తారు రోడ్డు

(సాలూరు, జూలై 14)

గిరి శిఖర గ్రామాల్లో నిర్మించిన రహదారులు మూణ్నాళ్ల ముచ్చటగానే మారుతున్నాయి. నెలల వ్యవధిలోనే బీటలు వారి.. కుంగిపోయి అధ్వానంగా దర్శనమిస్తున్నాయి. చిన్నపాటి వర్షాలకే అవి కోతకు గురవుతున్నాయి. కోట్లాది రుపాయల వ్యయంతో నిర్మించిన రోడ్లు అనతికాలంలోనే ఇలా మారడంపై గిరిజనులు పెదవి విరుస్తున్నారు. నాణ్యత ప్రమాణాలు పాటించకపోవడం, అధికారులు, ప్రజాప్రతినిధుల పర్యవేక్షణ కొరవడడమే ఈ దుస్థితికి కారణమని వారు వాపోతున్నారు. ఏదేమైనా గత వైసీపీ సర్కారు హయాంలో నియోజక వర్గంలో పలుచోట్ల నిర్మించిన రహదారులు.. ప్రారంభానికి ముందే పూర్తిగా ధ్వంసమవడంపై సర్వత్రా విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

ఇదీ పరిస్థితి..

గిరి శిఖర గ్రామలకు రహదారులకే కీలకం. చిన్నపాటి రహదారి నిర్మిస్తే చాలు. వారికి అన్ని సౌకర్యాలు అందుతాయి. ప్రధానంగా విద్య, వైద్యం, తాగునీరు, పారిశుధ్యసేవలకు ఎటువంటి ఇబ్బందులు ఉండవు. అత్యవసర వేళల్లో డోలీ కష్టాలు కూడా ఉండవు. దీనిలో దృష్టిలో పెట్టుకున్న కేంద్ర ప్రభుత్వం 2019లో భారత్ నిర్మాణ్ ప్రధానమంత్రి గ్రామ సడక్ యోజన (పీఎంజీఎస్‌వై) పథకం కింద సాలూరు నియోజకవర్గానికి పలు రహదారులను మంజూరు చేసింది. ఈ మేరకు పాచిపెంట మండలంలో ఆజూరు-చాకిరేవువలస, రొడ్డవలస-కంకనాపల్లి, వేటగానివలస- తంగ్లాం వయా మూటకూడు గ్రామాలకు, సాలూరు మండలంలో తోణాం-డిప్పలపాడు మీదుగా దిగువశెంబి వరకు, నంద- పగులచెన్నారు మీదుగా కొదమ గ్రామాలకు సంబంధించి 2020లో రహదారుల పనులు ప్రారంభించారు. అయితే వాటిల్లో తోణాం మినహా మిగతా రోడ్లు పూర్తవలేదు. ఇంకా పనులు జరుగుతున్నాయి. బిల్లులకు చెల్లింపులకు ఎలాంటి ఇబ్బందులు లేకపోయినప్పటికీ.. నిర్మాణంలో మాత్రం నాణ్యతకు తిలోదకాలిచ్చారు. ఎప్పటికప్పుడు పర్యవేక్షించాల్సిన అధికారులు సైతం తమకేమీ పట్టనట్లు వ్యవహరిస్తున్నారు. దీంతో పనులు పూర్తయిన కొద్దిరోజులకే ఆయా రోడ్లు పూర్తిగా పాడయ్యాయి. కోట్లాది రూపాయలతో నిర్మించిన బీటీ రోడ్లు ప్రారంభానికి ముందే పాడయ్యాయి. ఇటీవల కురిసిన వర్షాలకు కోతకు గురయ్యాయి. దీంతో ఆయా మార్గాల్లో ప్రయాణించలేని పరిస్థితి ఏర్పడింది. రోడ్ల నిర్మాణంపై గత వైసీపీ సర్కారు, అధికారులు పట్టించుకోకపోవడంపై ఆయా గ్రామాల గిరిజన ప్రజలు మండి పడుతున్నారు.

నిర్మాణాలు ఇలా..

కేంద్ర ప్రభుత్వం ఏపీ-20 ఎల్‌డబ్ల్యూఈ ప్యాకేజీలో భాగంగా ఈ రహదారుల నిర్మాణానికి నిధులు మంజూరు చేసింది. ఈ మేరకు సుమారు రూ. ఏడు కోట్ల 79 లక్షల అంచనా విలువతో తోణాం నుంచి డిప్పలపాడు మీదుగా దిగువశెంబి వరకు సుమారు 6.50 కిలోమీటర్ల మేర తారురోడ్డును నిర్మించాల్సి ఉంది. ఆ రహదారిలో 15 కల్వర్టులు, ఒక బ్రిడ్జిని నిర్మించాలి. 6.22 కిలోమీటర్ల మేర తారు రోడ్డు, 0.174 కిలోమీటర్ల మేర సిమెంట్ రోడ్డు వేయాల్సి ఉంది. ఈ పనులను 2023, నవంబరు 23న ప్రారంభించారు. ఈ ఏడాది మార్చి 31 నాటికి పనులు పూర్తయినా.. ప్రయోజనం శూన్యం. రోడ్డు ఫార్మేషన్‌కు సంబంధించి పటిష్ఠ చర్యలు తీసుకోలేదు. రోడ్డు వెడల్పు, మట్టి పని, వాటరింగ్, రోలింగ్‌లో ఎలాంటి నాణ్యతా ప్రమాణాలు పాటించలేదు. తారు, మెటల్‌చిప్స్‌కు సంబంధించి అధికారుల పర్యవేక్షణ కూడా కొరవడింది. దీంతో కొద్ది నెలలకే ఎక్కడ పడితే అక్కడ రోడ్డు బీటలు వారింది. కొన్నిచోట్ల రహదారి మొత్తం కిందకు దిగిపోయింది. అటుగా బైక్‌లు, నాలుగు చక్రాల వాహనాలు రాకపోకలు సాగించలేని పరిస్థితి ఏర్పడింది. ఒకవేళ ఏ వాహనమైనా వెళ్తే.. ఏకంగా లోయలోకి వెళ్లిపోవడం ఖాయం. ఈ మార్గంలో ఉన్న కల్వర్టులు, బ్రిడ్జిల నిర్మాణంలోనూ నాణ్యత లోపించింది. దీంతో చాలా చోట్ల అవి బీటలు వారాయి. అవి ఎప్పుడు కూలిపోతాయో తెలియని పరిస్థితి నెలకొంది. ఈ రహదారి నిర్మాణానికి సంబంధించి ఇప్పటికే రూ.ఆరుకోట్ల వరకు బిల్లులు చెల్లింపులు జరిగాయి. ఇంకా ఆఖరి బిల్లు చెల్లించాల్సి ఉందని అధికారులు చెబుతున్నారు. ఐదేళ్ల పాటు రోడ్డు నిర్వహణ బాధ్యత కూడా కాంట్రాక్టర్లే చూడాలని వారు తెలియజేస్తున్నారు. అయితే రోడ్డు నిర్మాణమే నాణ్యతా లోపంగా ఉంటే నిర్వాహణ ఏం చేస్తారని గిరిజనులు ప్రశ్నిస్తున్నారు.



బీటలు వారిన దృశ్యం

కానరాని మట్టి కాలువలు, రాతికట్టు

గిరిశిఖర గ్రామాలకు రహదారి నిర్మించే సమయంలో కొండలపై నుంచి వచ్చే వర్షపు నీరు పోయేందుకు ముందుగా మట్టి లేదా సిమెంట్ కాలువను ఏర్పాటు చేయాలి. కొండలకు అనుకుని ఫార్మేషన్ అప్పుడే జరగాలి. అలా చేస్తే.. కొండలపై నుంచి వచ్చిన వర్షపు నీరు ఆ కాలువల గుండా కిందకి పోయి కల్వర్టుల ద్వారా రోడ్డు అవతలికి పోతుంది. దీనివల్ల కోట్లాది రూపాయలతో నిర్మించిన తారురోడ్డు చాలా కాలం ఉంటుంది. అయితే అసలెక్కడా బెర్మ్‌లు, రోలింగ్‌లు, కాలువలు లేవు. చాలాచోట్ల రాతికట్టు (రివిట్‌మెంట్) కూడా చేయలేదు. దీంతో కొద్ది పాటి వర్షానికే కొండలపై నుంచి వచ్చి నీటితో పాటు మట్టి పెళ్లలు, చెట్లు, మొక్కలు కింద పడుతుండడంతో రోడ్డు పూర్తిగా పాడైపోతుంది. పాదచారులు కూడా రాకపోకలు సాగించలేని పరిస్థితి. నిర్మించిన కొద్ది కాలానికే రోడ్డు ధ్వంసం కావడంతో గిరిజనులు తీవ్ర ఇబ్బందులు పడాల్సి వస్తోంది.

మిగతా చోట్ల ఇలా..

- 2020లో సుమారు రూ.11 కోట్లతో సాలూరు మండలం నంద-పట్టుచెన్నారు నుంచి కొదమ వరకు రోడ్డు నిర్మాణం ప్రారంభించారు. అయితే ఇప్పటివరకు కేవలం 1.5 కిలోమీటర్ల మేర మాత్రమే రోడ్డు ఫార్మేషన్ చేశారు. రూ.40 లక్షల మేర బిల్లులు మంజూరయ్యాయి.
- పాచిపెంట మండలం ఆజూరు నుంచి చాకిరేవువలసకు మూడు కిలోమీటర్లు రోడ్డు నిర్మాణానికి రూ.రెండు కోట్ల 30 లక్షలు మంజూరయ్యాయి.
- రొడ్డవలస నుంచి కంకణాపల్లి 1.8 కిలోమీటర్ల రోడ్డు పనులకు రూ. కోటీ 40 లక్షలు మంజూరయ్యాయి. అయితే కేవలం రూ.20 లక్షల మేర బిల్లులు మాత్రమే చెల్లింపులయ్యాయి.
- వేటగానివలస-తంగ్లాం-మూటకూడు గ్రామాలకు సంబంధించి.. 5.6 కిలోమీటర్ల రోడ్డు నిర్మాణానికి రూ.4 కోట్లు మంజూరు చేశారు. అయితే రూ.మూడు కోట్ల వరకు బిల్లుల చెల్లింపులయ్యాయి. ఆయా రోడ్ల పనులు ఇంకా జరుగుతున్న నేపథ్యంలో నూతన ప్రభుత్వం, ప్రజాప్రతినిధులు, అధికారులు దృష్టి సారించి తగు చర్యలు తీసుకోవాలని గిరిజనులు కోరుతున్నారు.

ప్రారంభానికి ముందే...

గిరిజన గ్రామాల్లో నిర్మించిన రోడ్డు ప్రారంభానికి ముందే కోతకు గురైతే ఎలా? ఆ ప్రాంతవాసులు వారి బాధను ఎవరికి చెప్పుకోవాలి. రోడ్డు నిర్మాణంలో అసలు నాణ్యత పాటించడం లేదు. అధికారులూ పట్టించుకోవడం లేదు.

-కోరాడ ఈశ్వరరావు, సీపీఎం నాయకుడు, పాచిపెంట

సర్వసాధారణమే..

గిరిజన గ్రామాల్లో నిర్మించిన బీటీ రోడ్లు కొట్టుకుపోవడం సర్వసాధారణం. మైదాన ప్రాంతాల్లో వేసిన రోడ్లే నిలవవు. రోడ్డు నిర్మాణం జరిగిన తర్వాత ఐదేళ్ల పాటు దాని నిర్వహణను కాంట్రాక్టర్ చూడాలి. కోతకు గురైన చోట నిర్మాణ పనులు జరిగేలా చూస్తాం.

-చిన్నంనాయుడు,డీఈ, పంచాయతీరాజ్, సాలూరు



కాలువ ఇలా.. నీరు ఎలా?

ఇది గుమ్మడిగెడ్డ ఆనకట్ట ప్రాంతంలోని సాగునీటి కాలువ పరిస్థితి. పూర్తిగా పిచ్చిమొక్కలతో నిండిన దీని ద్వారా ఆయకట్టుకు నీరు చేరడం లేదు. గత వైసీపీ సర్కారు ఆనకట్టతో పాటు కాలువల నిర్వహణను సైతం గాలికొది లేసింది. ఐదేళ్లుగా కాలువల్లో పూడికలు కూడా తీయించలేదు. దీంతో 4,100 ఎకరాలకు గాను 2 వేల ఎకరాలకే సాగునీరు అందుతుంది. శివారు ప్రాంత రైతులు ఏటా శ్రమదానంతో కాలువల్లో పూడికలు తీసుకోవాల్సి వస్తోంది. నూతన ప్రభుత్వం స్పందించి ఆనకట్ట వద్ద షట్టర్లు బిగించాలని, కాలువలను బాగు చేయాలని ఆయకట్టుదారులు కోరుతున్నారు. - కురుపాం రూరల్

మూడిళ్లలో చోరీ

- ఉలిక్కిపడిన నర్సిపురం
- 34.5 తులాల బంగారం, 850 గ్రాముల వెండి అపహరణ



ఓ ఇంటిలో బీరువా తలుపులు తెరచి ఉన్న దృశ్యం

పార్వతీపురం రూరల్: పార్వతీపురం మండలం నర్సిపురం గ్రామంలో భారీ చోరీ జరిగింది. ఒకేరోజు మూడు ఇళ్లలో బంగారు ఆభరణాలు, వెండి వస్తువులను అపహరించారు. జిల్లాకేంద్రానికి అతి సమీపంలో ఉన్న గ్రామంలో ఈ ఘటన చోటుచేసుకోవడంతో స్థానికులు భయాందోళన చెందుతున్నారు. దీనిపై పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. నర్సిపురం గ్రామం పెద్దవీధిలో సిరిపురపు జగన్నాథం, ఆయన సోదరుడు వెంకటనాయుడు ఉంటున్నారు. కుమ్మరివీధిలో గార వెంకట రమణ నివసిస్తున్నారు. అనారోగ్యం కారణంగా వెంకటనాయుడు కొద్దిరోజులుగా పార్వతీపురంలోని ఓ ప్రైవేట్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నాడు. ఆయనకు తోడుగా భార్య కూడా అక్కడే ఉండడంతో ఇంటికి తాళాలు వేశారు. జగన్నాథం కూడా తన కుటుంబ సభ్యులతో కలిసి పెదమేరంగి గ్రామంలో జరిగిన శుభ కార్యానికి వెళ్లాడు. వివిధ పనుల నిమిత్తం వెంకటరమణ కూడా వేరే ఊరెళ్లాడు. అయితే తాళాలు వేసి ఉన్న ఈ మూడిళ్లను దొంగలు లక్ష్యంగా పెట్టుకున్నారు. శనివారం అర్ధరాత్రి దాటిన తర్వాత దొంగతనానికి పాల్పడినట్లు తెలుస్తోంది. ఆయా ఇళ్లకు ఉన్న తాళాలు పగలకొట్టి లోనికి ప్రవేశించారు. 34.5 తులాల బంగారం, 850 గ్రాముల వెండి, కొంత నగదు అపహరించారు. ఇందులో జగన్నాథానికి చెందిన 20 తులాల బంగారు ఆభరణాలు, సుమారు 500 గ్రాముల వెండి, వెంకటనాయుడుకు చెందిన 14.5 తులాల బంగారు ఆభరణాలు, కొంత నగదు, 350 గ్రాముల వెండి వస్తువులను చోరులు తస్కరించినట్లు సమాచారం. వెంకటరమణకు చెందిన వెండి వస్తువులు, కొంత నగదును చోరీ చేసినట్లు తెలిసింది. ఆదివారం తెల్లవారుజామున ఆయా ఇళ్ల తలుపులు తెరిచి ఉండడాన్ని స్థానికులు గమనించి.. బాధితులకు ఫోన్ చేశారు. వారు హుటాహుటిన ఇళ్లకు చేరుకున్నారు. బంగారం, వెండి వస్తువులు అపహరణకు గురైనట్లు గుర్తించి.. రూరల్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీంతో ఘటనా స్థలానికి చేరుకున్న వారు బాధితులు, స్థానికులతో మాట్లాడి వివరాలు సేకరించారు. దీనిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు రూరల్ ఎస్‌ఐ దినకరన్ తెలిపారు. అయితే ఎన్ని తులాల బంగారం, వెండి, ఎంత నగదు పోయిందన్న సమాచారాన్ని పోలీసులు ఇంకా వెల్లడించలేదు. వివరాలు పూర్తిగా తెలియాల్సి ఉందని వారు చెప్పారు.

నేడు సీతంపేటలో ప్రజా సమస్యల పరిష్కార వేదిక

- కలెక్టర్ ఆధ్వర్యంలో వినతుల స్వీకరణ

సీతంపేట: పార్వతీపురం కలెక్టరేట్‌లో ప్రతి సోమవారం నిర్వహించే ప్రజా సమస్యల పరిష్కార వేదికను నేడు సీతంపేట ఐటీడీఏలో నిర్వహించనున్నారు. కలెక్టర్ శ్యాంప్రసాద్ ఆధ్వర్యంలో అర్జీలను స్వీకరించనున్నారు. సీతంపేట ఐటీడీఏ పీవో సెలవు పెట్టి నెల రోజులు కావస్తుంది. పార్వతీపురం ఐటీడీఏ పీవో విష్ణుచరణ్ ఇన్‌చార్జి పీవోగా వ్యవహరిస్తున్నారు. ఇకపోతే ప్రతి సోమవారం జరిగే గ్రీవెన్స్‌లో పీవో ఆధ్వర్యంలో వినతులు స్వీకరిస్తున్నారు. దీంతో పూర్తిస్థాయిలో సమస్యలు పరిష్కారం కావడం లేదనే వ్యాఖ్యలు సర్వత్రా వినిపిస్తున్నాయి. అయితే టీడీపీ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత తొలిసారిగా కలెక్టర్ ఆధ్వర్యంలో ఐటీడీఏలో గ్రీవెన్స్ నిర్వహిస్తుండడంపై గిరిజనులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. వినతులు ఇవ్వడానికి సిద్ధమవుతున్నారు.





కృష్ణావతారంలో జగన్నాథుడు

- మారు రథయాత్రకు ఏర్పాట్లు పూర్తి

రథయాత్ర ఉత్సవాల్లో భాగంగా సాలూరు గుడించా మందిరంలో జగన్నాథుడు ఆదివారం బలరామకృష్ణుడు అవతారంలో భక్తులకు దర్శనమిచ్చాడు. తొలుత స్వామివారికి ప్రత్యేక పూజలు, అర్చనలు చేశారు. పట్టణంతో పాటు పరిసర గ్రామాల ప్రజలు పెద్దఎత్తున జగన్నాథుడిని దర్శించుకుని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. జిల్లాలోని పార్వతీపురం, కురుపాం, పాలకొండతో పాటు పలు మండలాల్లోనూ స్వామివారికి విశేష పూజలు చేశారు. ఇదిలా ఉండగా సోమవారం మారు రథయాత్రకు సంబంధించి నిర్వాహకులు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు. స్వామివారిని గుడించా మందిరం నుంచి తిరిగి ప్రధాన ఆలయానికి తీసుకెళ్లనున్నారు. దీంతో జగన్నాథుడి రథయాత్ర ఉత్సవాలు ముగియనున్నాయి.

- సాలూరు

మేలుకోకుంటే ముప్పే..

- కోతకు గురవుతున్న తోటపల్లి ఫ్లడ్‌బ్యాంక్, కుడి మట్టికట్ట
- భారీగా వర్షాలు కురిస్తే మరింతగా పెరిగే అవకాశం
- పొంచి ఉన్న ప్రమాదం
- అధికారులు స్పందించాలని రైతుల విన్నపం



ప్రాజెక్టు ప్రాంతంలో కోతకు గురవుతున్న ఫ్లడ్ బ్యాంక్

గరుగుబిల్లి: తోటపల్లి భారీ సాగునీటి ప్రాజెక్టు పరిధి స్పిల్‌వేకు సమీపంలో ఉన్న ఫ్లడ్ బ్యాంకు, కుడి మట్టికట్ట కోతలకు గురవుతున్నాయి. భారీగా వర్షాలు కురిస్తే.. కోతలు మరింతగా పెరిగి ప్రమాదం వాటిల్లే అవకాశం ఉంది. ఇటీవల కురిసిన వర్షాలకు గతేడాదిలో కొంతమేర నిర్వహించిన పనులు కూడా నీటి పాలవుతున్న పరిస్థితి ఏర్పడింది. వాస్తవంగా ప్రధాన స్పిల్‌వేకు ఆనుకుని కుడి, ఎడమ వైపు ఒడ్డు కోతలకు గురికాకుండా ఉండేందుకు, ఫ్లడ్ బ్యాంకు నిర్మాణానికి గత టీడీపీ ప్రభుత్వ హయాంలో ప్రతిపాదనలు రూపొందించారు. రెండు వైపులా రాతితో రివిట్‌మెంట్ పనులు, ఫ్లడ్ బ్యాంక్ నిర్మాణానికి రూ. 52 కోట్లతో అంచనాలు చేశారు. అయితే ఈ లోగా ఎన్నికలు జరగడం.. వైసీపీ అధికారంలోకి రావడంతో పనుల జాప్యం జరిగింది. గత ఐదేళ్లుగా రూ.52 కోట్లకు సంబంధించి రూ.7 కోట్లు మేర పనులు నిర్వహించారు. రివిట్‌మెంట్‌తో పాటు స్పిల్‌వే ప్రాంతంలో విద్యుత్ నిర్వహణ, డిస్ట్రిబ్యూటర్లు, రక్షణ గోడలు, తదితర పనులు నిర్వహించాల్సి ఉంది. అయితే కుడి, ఎడమ వైపు ఉన్న కొంతమేర రివిట్‌మెంట్ పనులు నిర్వహించారు. సకాలంలో బిల్లుల చెల్లింపులు జరగకపోవడంతో అర్థాంతరంగా పనులు నిలుపుదల చేశారు. మరోవైపు భారీ వర్షాలు, వరదల కారణంగా చేసిన పనులు నీటిలో కొట్టుకుపోయాయి. దీంతో కొన్నాళ్లుగా మళ్లీ అవే పనులు చేయాల్సి వస్తోంది. కాగా మట్టికట్టలకు ఆనుకుని కొంతమేర నిర్మించిన ఫ్లడ్ బ్యాంక్ అధికంగా కోతలకు గురికావడంతో అది బలహీనంగా తయారవుతుంది. దీనికి సమీపంలో ప్రాజెక్టుకు సంబంధించి గెస్ట్ హౌస్, పార్వతీపురానికి తాగునీరు సరఫరా చేసే ప్రధాన పంప్ హౌస్ ఉంది. వరద ప్రవాహం పెరిగితే.. వాటికి ప్రమాదం వాటిల్లే పరిస్థితి ఉంది. దీనిపై నూతన ప్రభుత్వం, ఉన్నతాధికారులు స్పందించి తగు చర్యలు తీసుకోవాలు ఆయా ప్రాంతవాసులు, ఆయకట్టుదారులు కోరుతున్నారు.

ప్రమాదం వాటిల్లకుండా చర్యలు..

తోటపల్లి స్పిల్‌వే ప్రాంతంలో ఒడ్డు కోతకు గురికాకుండా చూస్తాం. ఫ్లడ్ బ్యాంక్‌కు ప్రమాదం వాటిల్లకుండా అవసరమైన చర్యలు చేపడతాం. సుమారు రూ.45 కోట్లతో స్పిల్‌వేకు ఆనుకుని పనులు చేపట్టాల్సి ఉంది. వర్షాల కారణంగా నిర్వహించలేక పోతున్నాం. అక్టోబరు తర్వాత పనులు జరిగే అవకాశం ఉంది. గండ్లు పడకుండా ఉండేందుకు పార్వతీపురం, రాజాం డివిజన్ల పరిధిలోని 118 కిలో మీటర్ల వరకు కాలువల లైనింగ్ నిర్వహణకు రూ. 99.18 కోట్లతో ప్రతిపాదనలు పంపించాం. రైతులకు అసౌకర్యం కలగకుండా కుడి ప్రధాన కాలువ నుంచి సాగునీరు సరఫరా చేస్తున్నాం. లస్కర్ల నియామకానికి ప్రతిపాదనలు పంపించాం.

-ఆర్.రామచంద్రరావు, తోటపల్లి ప్రాజెక్టు ఈఈ, పార్వతీపురం



అసంపూర్తిగా రివిట్‌మెంట్ పనులు

దిక్సూచి DIKSUCHI

కొత్త క్రిమినల్ చట్టాలు


కొత్త దేశానికి స్వాతంత్ర్యం సిద్ధించి డెబ్బై ఏళ్ల పైమాటే అయినా ఇంకా వలస పాలన కాలం నాటి వందేళ్లకు పైగా పాతదైన పురాతన శిక్షా స్మృతులనే భారతదేశం అనుసరిస్తోంది. నేరాలు సంతరించుకున్న ఆధునిక రూపును న్యాయవ్యవస్థ అందుకోలేకపోవడంతో ఫిర్యాదులు, సాక్ష్యాధారాల సేకరణ, నేర విచారణల్లో జాప్యం అనివార్యమౌతోంది. 'జస్టిస్ డిలేయ్‌డ్ ఈజ్, జస్టిస్ డినైడ్ (న్యాయం ఆలస్యమవడం అంటే న్యాయాన్ని నిరాకరించడమే) అని లోకోక్తి. అందుకే పరిస్థితులకు అనుగుణంగా చట్టాలు మారాల్సి ఉంది. ఈ కోవలోనే క్రిమినల్ నేరాలకు సంబంధించిన మూడు ప్రధాన చట్టాలైన

- **'ఇండియన్ పీనల్ కోడ్'(భారతీయ శిక్షాస్మృతి),**
- **'క్రిమినల్ ప్రొసీజర్ కోడ్'(నేర విచారణ స్మృతి),**
- **'ఇండియన్ ఎవిడెన్స్ యాక్ట్'(భారతీయ సాక్ష్యాధార చట్టం)**లను పూర్తిగా సంస్కరించారు.

వీటిని ఆధునిక పేర్లతో 2024 జూలై 1 నుంచి అమల్లోకి తీసుకొచ్చారు. ఈ తేదీ తరవాత జరిగిన అన్ని నేరాలకు ఈ నూత న చట్టాలు వర్తిస్తాయి. ఈ నేపథ్యంలో ఆ చట్టాల్లో తెచ్చిన స్థూలమైన మార్పులకు సంబంధించిన ప్రధానాంశాలపై అవగాహన తప్పనిసరి.

కరెంట్ అఫైర్స్ / జనరల్ ఎస్సే

భారతీయ న్యాయ సంహిత (బీఎన్ఎస్)-2023



ఇది ఇండియన్ పీనల్ కోడ్ (ఐపీసీ)-1860 స్థానంలో వచ్చిన అధునాతన చట్టం. గతంలో ఐపీసీలో 511 సెక్షన్‌లు ఉండగా ప్రస్తుతం బీఎన్ఎస్‌లో 356 సెక్షన్‌లు ఉన్నాయి. మొత్తం 175 పాత సెక్షన్‌లను మార్చి 8 కొత్త సెక్షన్‌లు ప్రవేశపెట్టారు. 22 సెక్షన్లను సమూలంగా రద్దు చేశారు.

కీలకాంశాలు

బీఎన్ఎస్ ప్రకారం 'మూకదాడి'ని ఒక శిక్షార్హ నేరంగా పరిగణిస్తూ విపులీకరించారు. అయిదుగురు లేదా అంతకన్నా ఎక్కువమంది జాతి, మత, వర్గ తదితర ప్రాతిపదికల మీద విద్వేషపూరిత హత్య లేదా తీవ్రంగా గాయపరచినపుడు దానిని మూకదాడిగా పరిగణిస్తూ జీవితఖైదు లేదా మరణ శిక్ష విధిస్తారు.

రాజద్రోహం అనే నేరాన్ని శిక్షాస్మృతి నుంచి రద్దు చేసి 'దేశద్రోహం'అనే నేరాన్ని విశదీకరించి శిక్షార్హం చేశారు. టెర్రరిజం, వేర్పాటువాదం, సాయుధ తిరుగుబాటు, విధ్వంసకర కార్యకలాపాలకు పాల్పడడం, అటువంటి కార్యకలాపాలను ప్రోత్సహించడం; దేశ సార్వభౌమాధికారం, ఐక్యత, భద్రత, సమగ్రతలకు భంగం కలిగించడం వంటి చర్యలను దేశ ద్రోహంగా పరిగణిస్తారు.

పద్దెనిమిదేళ్ల కంటే తక్కువ వయసున్న బాలికతో జరిపిన లైంగిక చర్యను ఆమె అంగీకారం ఉన్నప్పటికీ, వివాహిత అయినప్పటికీ లైంగికదాడిగానే పరిగణిస్తారు. దీనిని శిక్షార్హమైన నేరంగా సూచించారు. పద్దెనిమిదేళ్లలోపు బాలికపై సామూహిక అత్యాచారానికి మరణదండన విధించవచ్చు.

నిజాలు దాచి వివాహం చేసుకోవడం, మభ్యపెట్టడం; ఉద్యోగం, ప్రమోషన్ వంటి ప్రలోభాలతో లొంగదీసుకొని లైంగికచర్య జరపడం వంటివాటిని నేరాలుగా పరిగణిస్తూ పదేళ్లవరకు జైలుశిక్ష, జరిమానా విధించవచ్చు.

స్నాచింగ్(బలవంతంగా లాక్కొనిపోవడం)ను దొంగతనంలో భాగంగా చూడడానికి బదులు ప్రత్యేక నేరంగా పరిగణిస్తూ ఈ శిక్షాస్మృతిలో చేర్చారు. వ్యవస్థీకృత నేరాలు అనే ప్రత్యేక విభాగంలోకి కిడ్నాప్‌లు, ఆర్థిక నేరాలు, సైబర్ నేరాలు, దోపిడీలు, భూకబ్జాలు, కాంట్రాక్ట్ హత్యలు, వాహనాల చోరీ వంటివాటిని చేర్చారు. నేర తీవ్రతను బట్టి శిక్షలు విధిస్తారు.

ప్రభుత్వాధికారుల విధి నిర్వహణకు అడ్డుపడే నిమిత్తం చేసిన ఆత్మహత్యా ప్రయత్నాన్ని నేరంగా పరిగణిస్తారు. ఆత్మహత్యకు ప్రయత్నించడం వంటి కొన్ని స్వల్ప నేరాలకు 'సామాజిక సేవ'ను శిక్షగా విధించడం వంటి వినూత్న అంశాలను నూతన న్యాయస్మృతిలో చేర్చారు.

నిర్లక్ష్యంగా వ్యవహరించి ఇతరుల మరణానికి కారణమవడం కూడా శిక్షార్హనేరంగా పరిగణించారు. ఈ నేరానికి రెండు నుంచి అయిదేళ్ల వరకు అదే వైద్యులకైతే రెండేళ్ల వరకు జైలు శిక్ష విధిస్తారు. తప్పుదోవ పట్టించే లేదా అసత్య వార్తలను ప్రచురించడం కూడా శిక్షార్హ నేరంగా సూచించారు. కొన్ని సెక్షన్లను బాలలకు సంబంధించిన అంశాలున్నవాటిని లింగ సమానత్వం దృష్ట్యా అన్ని లైంగికవర్గాలకు వర్తించేలా సవరించారు. అసహజ లైంగిక చర్య నిర్వచనం నుంచి 'స్వలింగ సంపర్కం'ను తొలగించి, నేరం కాదని తీర్మానించింది.



ఎం.బాలలత, సివిల్స్ మెంటార్

విమర్శలు

- భారతీయ న్యాయ సంహిత(బీఎన్ఎస్)లో బాలలు అంటే పద్దెనిమిదేళ్లలోపు వారిగా నిర్వచించడం వల్ల కొన్ని సెక్షన్ల అమలులో సందిగ్ధత తలెత్తనుంది. ఉదాహరణకు అత్యాచారం, సామూహిక అత్యాచారం వంటి అంశాల్లో వయో వ్యవధుల పరంగా సెక్షన్ల మధ్య సంఘర్షణ ఏర్పడవచ్చు.
- జస్టిస్ వర్మ కమిటీ సూచించిన విధంగా అత్యాచారాన్ని జెండర్ న్యూట్రల్(లింగసమానత)గా పరిగణించడం, మ్యారిటల్ రేప్‌ను నేరంగా సూచించడం వంటి అంశాలను నూతన న్యాయ సంహిత విస్మరించిందని; అత్యాచారం, లైంగిక వేధింపులకు సంబంధించి పాత ఐపీసీలోని అంశాలనే కొనసాగించారనీ పలు వర్గాలు విమర్శిస్తున్నాయి.
- క్రిమినల్ రెస్పాన్సిబిలిటీ ఏజ్ అంటే ఒక చర్య నేరం అని గ్రహించే వయసును ఏడేళ్లుగా, మానసిక పరిపక్వత ఆధారంగా పన్నెండేళ్ల వరకూ పరిగణించే విధంగా నిర్ణయించడం అనేది ప్రపంచవ్యాప్తంగా ఉన్న ప్రమాణాలతో విభేదించేలా ఉంది.
- కొన్ని సెక్షన్లలో తప్పనిసరి కనీస శిక్షను నిర్ణయించారు. ఇది న్యాయమూర్తుల విచక్షణాయుత తీర్పులకు ఆటంకం కావచ్చు.
- కమ్యూనిటీ సర్వీస్(సామాజిక సేవ)ను కొన్ని స్వల్ప తప్పిదాలకు శిక్షగా నిర్ధారించారు. అయితే ఒక చట్టం శిక్షల పరంగా ప్రతి అంశాన్నీ కూలంకశంగా వివరిస్తుంది. కానీ సామాజిక సేవ అంటే ఏంటో ఇతమిద్ధంగా ప్రస్తావించకపోవడం మాత్రం చట్టంలోని ప్రధాన లోపంగా చెప్పవచ్చు.
- క్లాజ్- 69లో మభ్యపెట్టడం, ప్రలోభపెట్టడం ద్వారా లైంగిక చర్య జరపడం అనే అంశం సహజీవనం, పరస్పర అంగీకారం వంటి సందర్భాల్లోనూ దుర్వినియోగమయ్యేందుకు అవకాశాలు ఉన్నాయని విమర్శలు వస్తున్నాయి.
- అనేక నేరాలకు మరణ శిక్ష ఉండడం కూడా పెద్ద ఎత్తున మానవ హక్కుల వర్గాల నుంచి, ప్రపంచవ్యాప్త హక్కుల సంస్థల నుంచి నిరసనలకు కారణమవుతోంది.
- వేర్పాటువాదం; దేశ సమగ్రతకు, ఐక్యతకు, భద్రతకు భంగం కలిగించడం వంటి దేశద్రోహ నిర్వచన అంశాలు ప్రత్యేక రాష్ట్రాల వాదనలను, హక్కుల కోసం జరిపే నిరసనలను కూడా ఈ నేరపరిధిలోకి తీసుకొచ్చే విధంగా ఉన్నాయనే విమర్శలు వస్తున్నాయి.

దిశలు - దూరాలు

రీజనింగ్

ఏపీపీఎస్సీ పోటీ పరీక్షల ప్రత్యేకం

పార్ట్-2

ముఖ్యరేఖాచిత్రం


1. సుమ ఇంటి నుంచి పాఠశాలకు వెళ్లాలనుకున్నది. ఆమె తన ఇంటి నుంచి ఉత్తర దిశగా బయలుదేరింది. కొంత సమయం తరవాత ఎడమవైపునకు తదుపరి కుడివైపునకు చివరగా మరల ఎడమవైపునకు తిరిగి పాఠశాలకు చేరుకున్నది. అయితే ఆమె ఇంటి నుంచి పాఠశాల ఏ దిశలో ఉంది?

ఎ) ఈశాన్యం బి) నైరుతి సి) ఆగ్నేయం డి) వాయువ్యం

సమాధానం: (డి)

వివరణ:

R- బయలుదేరినస్థానం (ఇల్లు)
S- చేరుకొనినస్థానం (పాఠశాల)




పై రేఖాచిత్రం ప్రకారం సుమ, ఇంటి నుంచి పాఠశాల వాయువ్య దిశలో ఉన్నదని తెలుస్తుంది.

2. 100 కి.మీ. పొడవు గల ఒక రోడ్డుపై రెండు కార్లు చెరొకవైపు నుంచి వ్యతిరేక దిశలలో ప్రయాణిస్తున్నాయి. మొదటికారు 20 కి.మీ. ప్రయాణించిన తరవాత కుడివైపునకు తిరిగి 10 కి.మీ. ప్రయాణించింది. తదుపరి ఎడమవైపు తిరిగి 20 కి.మీ. ప్రయాణించిన తదుపరి ఎడమవైపునకు తిరిగి ప్రధాన రహదారి కి చేరుకున్నది. రెండో కారు చిన్న లోపం వల్ల 15 కి.మీ. మాత్రమే ప్రయాణించి ఆగిపోయింది. అయితే ఇప్పుడు రెండు కార్ల మధ్య దూరం ఎంత?

ఎ) 35 కి.మీ. బి) 45 కి.మీ. సి) 30 కి.మీ. డి) 40 కి.మీ.

సమాధానం: (బి)

వివరణ:



I- మొదటి కారు
II- రెండవ కారు

పై రేఖాచిత్రం ప్రకారం మొదటి కారు ప్రధాన రహదారికి చేరుకున్న తరవాత గమనించిన మొదటికారు ప్రధాన రహదారి పరంగా 40 కి.మీ. దూరాన్ని పూర్తి చేసుకున్నది. రెండో కారు అదే ప్రధాన రహదారి పరంగా మరొకవైపు నుంచి 15 కి.మీ. పూర్తి చేసినది. ఈ రెండింటిని కూడి మొత్తం నుంచి తీసివేస్తే రెండుకార్ల మధ్య దూరం తెలుస్తుంది.


$100-(40+15) = 100-55=45$ కి.మీ. సమాధానం అవుతుంది.

3. A, B, C, D, E అనే అయిదుగురు వ్యక్తులు ఒక వరుసలో నిల్చున్నారు. E అనే వ్యక్తి Bకి ఎడమవైపు 40మీ. దూరంలో ఉన్నాడు. A అనే వ్యక్తి Cకి ఎడమవైపు 20మీ. దూరంలో ఉన్నాడు. D అనే వ్యక్తి Eకి కుడివైపు 20మీ. దూరంలోను, Cకి కుడివైపు 50మీ. దూరంలోను ఉన్నాడు. అయితే A, Bల మధ్య దూరం ఎంత?

ఎ) 90 మీ. బి) 60 మీ. సి) 70 మీ. డి) 80 మీ.

సమాధానం: (ఎ)

వివరణ:




పై వివరణ ఆధారంగా A, Bల మధ్య దూరం 90 మీ. అని తెలుస్తుంది.

4. ఒక బాలుడు సైకిల్‌పై తూర్పునకు కొంత దూరం ప్రయాణించిన తరవాత కుడివైపునకు తిరిగి 2 కి.మీ. ప్రయాణించాడు. తదుపరి మరల కుడివైపునకు తిరిగి 3 కి.మీ. ప్రయాణించాడు. ఇప్పుడు అతను బయలుదేరిన స్థానం నుంచి దక్షిణంగా కచ్చితంగా 2 కి.మీ. దూరంలో ఉన్నాడు. అయితే ఆ బాలుడు మొదట్లో తూర్పునకు ఎంతదూరం ప్రయాణించాడు?

ఎ) 2 కి.మీ. బి) 4 కి.మీ. సి) 3 కి.మీ. డి) 5 కి.మీ.

సమాధానం: (సి)

వివరణ:




బయలుదేరిన స్థానానికి, చేరుకున్న స్థానం 2 కి.మీ. దూరంలో దక్షిణాన ఉంది. కాబట్టి పై డయాగ్రామ్‌ను పరిశీలిస్తే ఆ బాలుడు సైకిల్‌పై మొదట్లో తూర్పునకు 3 కి.మీ. ప్రయాణించాడని తెలుస్తుంది.

5. ఆనంద్ మ్యూజియానికి వెళ్లాలనుకున్నాడు. అతను తన ఇంటి నుంచి బయలుదేరాడు. అతని ఇల్లు దక్షిణదిశలో ఉంది. ఆ రోడ్డు కూడలి లేదా చౌరస్తాకు వచ్చిన తరవాత కుడివైపున పాఠశాల, ఎడమవైపున ఆటస్థలం ఉన్నది. అయితే మ్యూజియం ఏ దిశలో ఉంది?

ఎ) తూర్పు బి) పడమరసి) దక్షిణం డి) ఉత్తరం

సమాధానం: (డి)

వివరణ:




ఇటువంటి ప్రశ్నలలో ముఖ్య దిశలు(తూర్పు, పడమర, ఉత్తరం, దక్షిణం)లో మిగిలి ఉన్నదే సమాధానం అవుతుంది.

6. సూర్యోదయం తరవాత విక్రమ్ ఒక స్తంభాన్ని చూస్తూ నిలుచున్నాడు. స్తంభం నీడ విక్రమ్‌కు కుడివైపున ఉన్నది అనుకుంటే విక్రమ్ ఇప్పుడు ఏ దిక్కును చూస్తూ నిలుచున్నాడు?

ఎ) పడమర బి) ఉత్తరం సి) తూర్పు డి) దక్షిణం

సమాధానం: (డి)

వివరణ: నీడ ప్రశ్నల్లో గుర్తించుకోండి. నీడ ఎప్పుడైనా సరే సూర్యునికి వ్యతిరేక దిశలో ఉంటుంది. అంటే ఉదయం సూర్యుడు తూర్పున ఉంటారు కాబట్టి ఉదయం పూట ఏదైనా వస్తువు నీడ, వ్యక్తి నీడ చెట్టునీడ గాని మరే నీడైనా గాని పడమర ఉంటుంది. సాయంత్రం పూట సూర్యుడు పడమర వైపున ఉంటాడు. (అస్తమించే సమయంలో) కాబట్టి సాయంత్రం పూట ఏ నీడైనా తూర్పున ఉంటుంది. గుర్తుంచుకోండి నీడ సూర్యునికి వ్యతిరేకంగా ఉంటుంది.



ప్రశ్నలో నీడ విక్రమ్‌కు కుడివైపునకు ఉందని ఉన్నది. ఉదయంపూట కాబట్టి నీడ పడమరకు ఉంటుంది. దక్షిణ మునకు కుడివైపు పడమర అంటే విక్రమ్ దక్షిణానికి చూస్తూ నిలబడితే అతని కుడివైపు (పడమర) స్తంభం నీడ ఉందని అర్థం. విక్రమ్ కిందికి అనగా దక్షిణ దిక్కును చూస్తున్నాడు. ఇప్పుడు విక్రమ్‌కి కుడివైపు అంటే పడమర వైపు స్తంభం నీడ ఉంది.



డాక్టర్ పండిటి మీనాక్షి పవన్, సీనియర్ ఫ్యాకల్టీ

మోదీ @ 10 కోట్లు

'ఎక్స్'లో ప్రధానిని ఫాలో అవుతున్న వాళ్ల సంఖ్య

- ఒబామా తర్వాత అంతమంది అనుసరిస్తున్న నేత
- క్రీడాకారులు, సెలబ్రిటీల కంటే ఆయనకే క్రేజ్
- సంతోషం వ్యక్తం చేస్తూ స్వీయ పోస్టు

న్యూఢిల్లీ, జూలై 14: 10 కోట్లు! భారత ప్రధాని నరేంద్రమోదీని 'ఎక్స్'లో ఫాలో అవుతున్నవారి సంఖ్య ఇది. అమెరికా మాజీ అధ్యక్షుడు బరాక్ ఒబామా(13 కోట్లు) తర్వాత ఈ మైలురాయిని చేరుకున్న మరో నేతగా, ప్రభావవంతమైన వ్యక్తిగా మోదీ నిలిచారు. ప్రపంచ ప్రసిద్ధి గాంచిన పలువురు సెలబ్రిటీలు, క్రీడాకారుల కంటే మోదీనే 'ఎక్స్'లో ఎక్కువ మంది ఫాలో అవుతుండటం విశేషం. అలాగే తన రాజకీయ ప్రత్యర్థులైన రాహుల్‌గాంధీ(2.64 కోట్లు), అరవింద్ కేజ్రీవాల్(2.75 కోట్లు), అఖిలేశ్ యాదవ్(1.90 కోట్లు), మమతాబెనర్జీ(74 లక్షలు) వంటి వారి కంటే ఫాలోవర్స్ విషయంలో ఆయన అందనంత ఎత్తుకు ఎదిగిపోయారు. అదేవిధంగా ప్రముఖ క్రీడాకారులు విరాట్ కోహ్లి(6.4 కోట్లు), నేమర్ జూనియర్(6.3 కోట్లు), లెబ్రోన్ జేమ్స్(5.2 కోట్లు)లను అలాగే టేలర్ స్విఫ్ట్(9.5 కోట్లు), లేడీ గాగా(8.3 కోట్లు), కిమ్ కర్దాషియన్(7.52 కోట్లు) వంటి సెలబ్రిటీలను సైతం అధిగమించారు. 10 కోట్ల మార్క్ చేరుకున్న సందర్భంగా మోదీ తన సంతోషాన్ని వ్యక్తం చేశారు. చర్చోపచర్చలకు, విమర్శలకు, ప్రజల ఆశీర్వాదాలకు నిలయమైన ఇటువంటి చైతన్యవంతమైన మాధ్యమంలో భాగమైనందుకు సంతోషంగా ఉందని పోస్టు చేశారు. కాగా, 2009లో 'ఎక్స్'లో ఖాతా తెరిచినప్పటి నుంచి ఇప్పటిదాకా ఈ మాధ్యమాన్ని ఆయన బాగా ఉపయోగించుకున్నారు. కార్యకర్తలను, పార్టీ శ్రేణులను, సహచర మంత్రులను ఉత్తేజపరుస్తూ, విపత్తులు, శుభాశుభాలు చోటుచేసుకున్నప్పుడు స్పందిస్తూ ముందుకు సాగుతున్నారు. గడిచిన మూడేళ్లలో సుమారు 30 కోట్ల మంది మోదీని 'ఎక్స్'లో ఫాలో అయ్యారు. ఇతర మాధ్యమాలైన యూట్యూబ్, ఇన్‌స్టాగ్రామ్‌లలో కూడా ఆయనను అనుసరించే వారి సంఖ్య గణనీయంగా పెరుగుతుండటం గమనార్హం. యూట్యూబ్‌లో మోదీకి 2.5 కోట్ల సబ్‌స్క్రైబర్స్ ఉండగా, ఇన్‌స్టాలో ఆయన 10 కోట్ల ఫాలోవర్లకు చేరువలో ఉన్నారు.

లోక్‌సభలో కాంగ్రెస్ డిప్యూటీ లీడర్‌గా గౌరవ్ గొగోయ్

- స్పీకర్‌కు సీపీపీ చైర్‌పర్సన్ సోనియా లేఖ

న్యూఢిల్లీ, జూలై 14 (ఆంధ్రజ్యోతి): లోక్‌సభలో కాంగ్రెస్ డిప్యూటీ ఫ్లోర్ లీడర్‌గా ఎంపీ గౌరవ్ గొగోయ్‌కు ఆ పార్టీ మరోసారి అవకాశమిచ్చింది. చీఫ్ విప్‌గా సీనియర్ నేత కొడికున్నిల్ సురేశ్, విప్‌లుగా మాణిక్కం ఠాగూర్, మహమ్మద్ జావేద్‌లను నియమించింది. ఈ మేరకు లోక్‌సభ స్పీకర్ ఓం బిర్లాకు కాంగ్రెస్ పార్లమెంటరీ పార్టీ (సీపీపీ) చైర్‌పర్సన్ సోనియా గాంధీ లేఖ రాశారు. ఇదే విషయాన్ని పార్టీ ప్రధాన కార్యదర్శి కేసీ వేణుగోపాల్ ఆదివారం 'ఎక్స్' వేదికగా వెల్లడించారు. లోక్‌సభలో ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ మార్గనిర్దేశంలో కాంగ్రెస్, ఇండియా కూటమి పార్టీలు ప్రజా సమస్యలపై సమష్టిగా పోరాడతాయని స్పష్టం చేశారు. కాగా, ఇప్పటివరకు సురేశ్ (మావేలికర) కేరళ నుంచి 8 సార్లు ఎంపీగా గెలవగా.. మాణిక్కం ఠాగూర్ (విరుదునగర్) తమిళనాడు నుంచి 3 సార్లు, జావేద్ (కిషన్‌గంజ్) బిహార్ నుంచి 2 సార్లు గెలిచారు.

మణిపూర్‌లో సీఆర్పీఎఫ్ జవాను మృతి

ఇంఫాల్, జూలై 14: మణిపూర్‌లో జిరిబం జిల్లాలోని మాంగ్‌బంగ్ ప్రాంతంలో ఆదివారం ఉదయం భద్రతా బలగాలపై జరిగిన దాడిలో ఓ సీఆర్పీఎఫ్(సెంట్రల్ రిజర్వ్‌డ్ పోలీస్ ఫోర్స్) జవాన్ మృతి చెందారు. దుండగులు తుపాకీతో కాల్పులు జరిపినట్లు తెలుస్తోంది. మరణించిన జవాన్‌ను బిహార్‌కు చెందిన అజయ్ కుమార్ ఝాగా అధికారులు గుర్తించారు. తలలో బుల్లెట్ దిగడంతోనే ఆయన మరణించినట్లు వైద్యులు ధ్రువీకరించారు. ఈ ఘటనలో మరో పోలీసుకు గాయాలయ్యాయి. కుకీలకు చెందిన మిలిటెంట్లే ఈ దాడి చేసి ఉంటారని పోలీసులు అనుమానిస్తున్నారు.

తెరుచుకున్న జగన్నాథుడి రత్నభాండాగారం



ఖజానాను తరలించేందుకు సిద్ధంగా ఉంచిన చెక్కపెట్టెలు

- 46 ఏళ్ల తర్వాత తెరిచిన ఒడిశా ప్రభుత్వం
- రహస్య గదిలోకి ప్రవేశించిన 11మంది సభ్యులు
- ఖజానాను తరలించడానికి 6 చెక్క పెట్టెలు సిద్ధం
- బయటి గదిలోని సంపదను వాటిలోకి చేర్చి సీలు

పూరీ, జూలై 14: పూరీ క్షేత్రంలోని 12వ శతాబ్దానికి చెందిన జగన్నాథుడి ఖజానా రత్నభాండాగారం 46 ఏళ్ల తర్వాత తిరిగి తెరుచుకుంది. గదిలోపల ఉన్న విలువైన వస్తువుల లెక్కింపుతో పాటు శిథిలావస్థకు చేరుకున్న నిర్మాణానికి మరమ్మతులు చేయడానికి ఖజానాను తెరిచినట్లు అధికారులు వెల్లడించారు. చివరిసారిగా ఈ ఖజానాను 1978లో తెరిచి, అందులోని సంపదను లెక్కించారు. అప్పట్లో రూపొందించిన జాబితా ప్రకారం రత్నభాండాగారంలోని రెండు గదుల్లో 128.380 కిలోల బంగారు ఆభరణాలు, 221.530 కిలోల వెండి వస్తువులు ఉన్నాయి. రాష్ట్ర ప్రభుత్వం నియమించిన కమిటీ సభ్యులు ఆలయంలో స్వామికి ప్రత్యేక పూజల అనంతరం ఆదివారం మధ్యాహ్నం 1.28 గంటల సమయంలో రహస్య గదిని తెరిచారు. జగన్నాథుడి ఖజానా తలుపులు తెరిచినట్లు ఒడిశా సీఎం కార్యాలయం 'ఎక్స్'లో పోస్టు చేసింది. నలుగురు ఆలయ సేవకులతో పాటు కమిటీ చైర్మన్ జస్టిస్ బిశ్వనాథ్ రథ్, శ్రీ జగన్నాథ టెంపుల్ అడ్మినిస్ట్రేషన్ (ఎస్‌జేటీఏ) చీఫ్ అడ్మినిస్ట్రేటర్ అరబింద పాఢీ, ఆర్కియాలజికల్ సర్వే ఆఫ్ ఇండియా (ఏఎస్ఐ) సూపరింటెండెంట్ డీబీ గడనాయక్, పూరీ రాజు గజపతి మహారాజు ప్రతినిధి సహా మొత్తం 11మంది సభ్యులు గదిలోకి ప్రవేశించారని అధికారులు పేర్కొన్నారు. రత్నభాండాగారం తలుపులు తెరవనున్న నేపథ్యంలో కమిటీ సభ్యులు ఉదయం గుండిచ మందిరంలో జగన్నాథ స్వామికి, ఆయన తోబుట్టువులకు ప్రత్యేక పూజలు నిర్వహించి అనుమతి తీసుకున్నారు. పూరీలో రథయాత్ర సాగుతున్నందున జగన్నాథుడు, బలభద్రుడు, సుభద్రదేవి విగ్రహాలు ప్రస్తుతం గుండిచ ఆలయంలో ఉన్నాయి. వచ్చేవారం జరిగే బహుదా యాత్ర సందర్భంగా దేవతామూర్తులను తిరిగి శ్రీక్షేత్రానికి తీసుకొస్తారు. రహస్య గదిలో విషసర్పాలు నిధిని కాపలా కాస్తుంటాయన్న అనుమానాలతో ముందు జాగ్రత్తగా పాములు పట్టడంలో నిపుణులతో పాటు సత్వర చికిత్స కోసం వైద్య సిబ్బందిని అందుబాటులో ఉంచారు. ఆలయం లోపల, బయట రెండు స్నేక్ క్యాచర్ల బృందాలను సిద్ధంగా ఉంచామని స్నేక్ హెల్ప్‌లైన్ సభ్యుడు సుభేందు మల్లిక్ తెలిపారు. అంతకుముందు ఎస్‌జేటీఏ చీఫ్ అరబింద పాఢీ మీడియాతో మాట్లాడుతూ ఒడిశా ప్రభుత్వ ఆదేశాల ప్రకారం ఖజానాను తెరిచినప్పటికీ విలువైన వస్తువుల లెక్కింపు ప్రక్రియను ఇప్పటికిప్పుడే చేపట్టబోమని చెప్పారు. స్వర్ణకారులు, ఇతర నిపుణుల నియామకం తర్వాతే ఈ కార్యక్రమం కొనసాగుతుందన్నారు. తొలుత రత్నభాండాగారం బయట, లోపలి గదుల్లో ఉన్న ఆభరణాలు, ఇతర విలువైన వస్తువులను చెక్క పెట్టెల్లో భద్రపరిచి సీసీ కెమెరాలు ఏర్పాటు చేసిన తాత్కాలిక స్ట్రాంగ్ రూంకు తరలిస్తామని తెలిపారు. ఖజానా నిర్మాణం భద్రతను నిర్ధారించడం తమ తొలి ప్రాధాన్యంగా చెప్పారు. సంపద ఉన్న పెట్టెలు జీర్ణావస్థకు చేరి ఉంటే ఆభరణాలను తరలించడానికి వీలుగా ఇత్తడి పూత పూసిన ఆరు చెక్క బాక్సులను సిద్ధంగా ఉంచారు. ఖజానా బయట గదిలో ఉన్న ఆభరణాలను ఈ కలప పెట్టెల్లోకి మార్చి సీలు వేసినట్లు తెలిపారు. బహుదా యాత్ర అనంతరం లోపలి గదిలోని బంగారం, వెండి సామగ్రిని కూడా తరలిస్తామని పాఢీ పేర్కొన్నారు. ఆర్‌బీఐ ప్రతినిధి సమక్షంలో ఆభరణాల లెక్కింపు ప్రక్రియ చేపడతామని ఆ తర్వాత వాటి ఫొటోలు, బరువు, నాణ్యత తదితర వివరాలతో డిజిటల్ కేటలాగ్ రూపొందిస్తామని ఒడిశా న్యాయశాఖ మంత్రి పృథ్వీరాజ్ హరిచందన్ తెలిపారు.



రత్నభాండాగారాన్ని తెరిచే సమయంలో ఆలయం వద్ద భక్తులు

రత్నభాండాగారం వద్ద స్పృహ తప్పిన పూరీ ఎస్పీ?

పూరీ పోలీసు సూపరింటెండెంట్ పినాక్ మిశ్రా శ్రీమందిరంలోని రత్నభాండాగారం తలుపు వద్ద స్పృహ తప్పి పడిపోయారని, ఖజానాలోకి ప్రవేశించిన సభ్యుల్లో ఒకరైన డాక్టర్ సీబీకే మొహంతి ఎస్పీకి చికిత్స అందించారని వార్తలు వచ్చాయి. అయితే ఈ వార్తలను ఆలయ భద్రతను పర్యవేక్షిస్తున్న ఎస్పీ మిశ్రా ఖండించారు. ఆలయ సింహద్వారం వద్ద ఆయన మీడియాతో మాట్లాడారు. తనకు ఎలాంటి అనారోగ్యం లేదని, తాను పూర్తి ఆరోగ్యంగా ఉన్నానని స్పష్టం చేశారు.

సైబర్ మోసగాళ్లతో జాగ్రత్త!

పోలీసు, నిఘా, దర్యాప్తు సంస్థల పేరిట నకిలీ ఈమెయిళ్లు

- వాటికి స్పందించవద్దు
- 1930కి ఫోన్ చేసి తెలియజేయాలి: కేంద్ర హోంశాఖ

న్యూఢిల్లీ, జూలై 14: పోలీసు విభాగాలు, దర్యాప్తు సంస్థల పేరిట సైబర్ మోసగాళ్లు నకిలీ ఈ మెయిళ్లు, నోటీసులు పంపుతున్న ఘటనలు పెరుగుతున్నాయని.. వీటి పట్ల జాగ్రత్తగా ఉండాలని కేంద్ర హోంశాఖకు చెందిన 'ఇండియన్ సైబర్ క్రైమ్ కో ఆర్డినేషన్ సెంటర్' (ఐ4సీ) ప్రజలకు సూచించింది. ఈ తరహా మెయిళ్లు వచ్చినప్పుడు.. అవి నిజంగానే ప్రభుత్వ వెబ్‌సైట్ నుంచి వచ్చాయా? అని తెలుసుకోవటానికి ఆ వెబ్‌సైట్ చివర gov.in ఉందా అనేది చూడాలని పేర్కొంది. అలాగే, సదరు మెయిల్‌లో ప్రస్తావించిన అధికారుల గురించి సమాచారం, వారి వివరాలను ఇంటర్నెట్‌లో సెర్చ్ చేసి తెలుసుకోవాలని, సంబంధిత ప్రభుత్వ విభాగానికి ఫోన్ చేసి ఈ మెయిల్ గురించి తెలియజేయాలని సూచించింది. ఈ మేరకు ఐ4సీ ఆదివారం ఒక ప్రకటన జారీ చేసింది. అనుమానాస్పద ఈమెయిళ్లు వచ్చినప్పుడు, ఇతరత్రా సైబర్ మోసాలు జరిగినప్పుడు వెంటనే ప్రజలు అప్రమత్తమై www.cybercrime.gov.in కు, లేదా సైబర్ క్రైం హెల్ప్ నంబరు 1930కి సమాచారం అందించాలని తెలిపింది. కాగా, ఈ నెల ఆరంభంలోనూ కేంద్ర ఆర్థికశాఖ ఒక సూచన జారీ చేసింది. ఢిల్లీ పోలీసు సైబర్ క్రైమ్ అండ్ ఎకనామిక్ అఫెన్స్, సెంట్రల్ ఎకనామిక్ ఇంటెలిజెన్స్ బ్యూరో, ఇంటెలిజెన్స్ బ్యూరో, ఢిల్లీ సైబర్ సెల్ పేర్లతో, ఆయా సంస్థల లోగోలతో, అధికారుల సంతకాలతపంపిస్తున్నారని పేర్కొంది. దీంతో పాటు ఒక అటాచ్‌మెంట్ కూడా పంపుతున్నారని.. చైల్డ్ పోర్నోగ్రఫీ, సైబర్ పోర్నోగ్రఫీ వంటి నేరాలకు పాల్పడ్డావంటూ బెదిరిస్తున్నారని తెలిపింది. ఈ తరహా మెయిళ్లు వచ్చినప్పుడు వాటికి ప్రతిస్పందించవద్దని, వీటి గురించి సమీపంలోని పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయాలని సూచించింది. ఢిల్లీలోని సెంట్రల్ సెక్రటేరియట్‌లో పని చేసే ఉద్యోగులకు కూడా గత వారం అనుమానాస్పద ఈమెయిళ్లు వచ్చాయి.

ఇంకెన్నాళ్లో...

● వెలగని వీధి దీపాలు.. పది నెలలుగా అంధకారం

● రాజాం మెయిన్‌రోడ్‌లో దుస్థితి ● మొత్తం లైట్లు 110.. వెలగనివి 73


మెయిన్‌రోడ్‌లో అలముకున్న చీకట్లు

రాజాం రూరల్: రాజాం పట్టణంలోని మెయిన్‌రోడ్‌లో చీకట్లు అలముకున్నాయి. చీకటి పడిందంటేచాలు వాహన చోదకులు నానా అవస్థలు పడుతున్నారు. భారీ వాహనాల పరిస్థితి సరేసరి. సుమారు పది నెలలుగా ఇదే పరిస్థితి. శ్రీకాకుళం రోడ్‌లోని సప్తగిరి కాలనీ నుంచి బొబ్బిలి జంక్షన్ వరకూ అంధకారం రాజ్యమేలుతోంది. సెంటర్ లైటింగ్‌లో సగానికి పైగా బల్బులు వెలగకపోవడంతో ప్రయాణికుల బాధ వర్ణనాతీతం. గతేడాది ఆంధ్రజ్యోతిలో సెప్టెంబరు 15న మున్సిపాలిటీలో అంధకారం శీర్షికన కథనం ప్రచురించినా యంత్రాంగంలో కదలిక రాలేదు. దిద్దుబాటు చర్యలు ప్రారంభించలేదు. పరిస్థితిలో మార్పు రాకపోవడంతో గతేడాది అక్టోబరులో సైతం సెంటర్ లైటింగ్ దుస్థితి, వాహన చోదకులు అనుభవిస్తున్న వెతలపై ఆంధ్రజ్యోతి మరోమారు కథనం ప్రచురించింది. సార్వత్రిక ఎన్నికల ముందు మున్సిపల్ కమిషనర్‌గా విధుల్లో చేరిన రామ అప్పలనాయుడు కొన్ని బల్బులు మార్పించారు. ఆపై మున్సిపల్ యంత్రాంగం సెంటర్ లైటింగ్ వైపు కన్నెత్తి చూడలేదు. దీంతో పరిస్థితి మరింత దారుణంగా మారింది. తొలివిడత విస్తరణలో 55 స్తంభాలు వేసి వాటికి 110 లైట్లు ఏర్పాటు చేయగా గతేడాది అక్టోబరు నాటికి 61 లైట్లు కాలిపోగా ప్రస్తుతం ఆ సంఖ్య 73కి చేరింది.

● **ఎక్కడెక్కడ..**

శ్రీకాకుళం రోడ్‌లోని సప్తగిరి కాలనీ నుంచి బొబ్బిలి జంక్షన్ వరకూ డివైడర్ నిర్మించి 55 విద్యుత్ స్తంభాలకు రెండేసి లైట్లు వంతున 110 లైట్లు ఏర్పాటు చేశారు. సప్తగిరి కాలనీ నుంచి అంబేడ్కర్ జంక్షన్ వరకూ 31 స్తంభాలకు 62 లైట్లు ఉండగా ప్రస్తుతం 46 లైట్లు వెలగడం లేదు. అంబేడ్కర్ జంక్షన్ నుంచి బస్టాండ్ కూడలి వరకూ ఆరు స్తంభాలకు 12 లైట్లు ఉండగా 9 లైట్లు మరమ్మతులకు గురయ్యాయి. బస్టాండ్ కూడలి నుంచి బొబ్బిలి జంక్షన్ వరకూ 18 స్తంభాలకు 36 లైట్లకుగాను 18 బల్బులు కాలిపోయి దిష్టిబొమ్మల్లా కనిపిస్తున్నాయి. మొత్తమ్మీద సప్తగిరి కాలనీ నుంచి బొబ్బిలి జంక్షన్ వరకూ 73 లైట్లు వెలగడం లేదు. దీంతో సుమారు కిలోమీటర్ మేర చీకట్లు అలముకుంటున్నాయి. ఇదిలా ఉంటే.. చీకటిపడితే చాలు పశువులు రోడ్డుపై తిరుగాడుతూ ప్రమాదాలకు కారణమవుతున్నాయి. చీకటి కావడంతో ద్విచక్ర వాహన చోదకులు ప్రమాదాల బారినపడుతున్నారు.

● **అన్ని లైట్లు వేయిస్తాను..**

మెయిన్‌రోడ్‌లో లైట్లు వెలగకపోవడం వాస్తవమే. అవసరమైన మెటీరియల్ తెప్పించాం.. సాధ్యమైనంత త్వరలో కాలిపోయిన లైట్లు స్థానంలో కొత్తవి వేయిస్తాం. లైట్లు వేసేందుకు అవసరమైన జేసీబీ అందుబాటులో లేకపోవడంతో ఆలస్యం జరిగింది. త్వరలో కొత్త బల్బులు అమరుస్తాం.

-రామ అప్పలనాయుడు, కమిషనర్, రాజాం మున్సిపాలిటీ

నిందితుడిని కఠినంగా శిక్షించాలి



రామభద్రపురంలో ఐద్వా నాయకు నిరసన


బొబ్బిలి: మాట్లాడుతున్న జనసేన నాయకులు

రామభద్రపురం: పసికందుపై అత్యాచారం చేసిన మానవమృగాన్ని కఠినంగా శిక్షించాలని కోరుతూ ఐద్వా జిల్లా అధ్యక్షుడు కే.పుణ్యవతి ఆధ్వర్యంలో రామభద్రపురం సచివాలయం ఆవరణలో నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా ఆమె మాటాడుతూ ఒక గిరిజన పసికందుపై ఇలా జరగడం బాధాకరమన్నారు. యువత చెడు అలవాట్లకు బానిసైపోయి మహిళల జీవితాలు నాశనం చేస్తున్నారన్నారు. నిందితుడిని కఠినంగా శిక్షించాలని బొబ్బిలి డీఎస్పీకి వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో మండల కార్యదర్శి బలసా శ్రీను, ఐద్వా నాయకులు పద్మ, మహిళలు పాల్గొన్నారు.

బొబ్బిలి: పసికందుపై పాశవిక దాడి జరిగినట్లు తెలియగానే చలించిపోయామని ఐద్వా నాయకురాలు కె.పుణ్యవతి, జనసేన నాయకులు పాలూరుబాబు, కారుణ్యఫౌండేషన్ చైర్మన్ జేసీ రాజు, విద్యార్థి సంఘం నాయకుడు సాయికిరణ్‌యాదవ్, సీపీఎం నాయకులు పి.శంకరరావు తదితరులు వాపోయారు. దీనిపై ఆదివారం వేర్వేరు ప్రకటనల్లో తీవ్రంగా ఖండించారు. నిందితునికి కఠిన శిక్ష పడేలా పోలీసుయంత్రాంగం చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ● ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న బాలికను పరామర్శించి కుటుంబ సభ్యులను ఓదార్చామని, కొంత ఆర్థిక సహాయం చేశామని జనసేన నేత పాలూరు బాబు, మండల పార్టీ అధ్యక్షుడు సంచానగంగాధర్, బవిరెడ్డిమహేశ్, బొండాడ గణేశ్, సాయిలు తెలిపారు.

విజయనగరం దాసన్నపేట: సంఘటన బాధకరమని జనసేన నాయకులు గురాన అయ్యలు అన్నారు. ఆదివారం ఆర్టీసీ కాంప్లెక్స్ సమీపంలోని ఆయన కార్యాలయంలో మాట్లాడుతూ, ఇటువంటి అమానుషమైన సంఘటనలను తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు.

విజయనగరం రూరల్: ఆరు నెలల చిన్నారిపై జరిగిన అత్యాచార ఘటనపై ఎస్టీ కమిషన్ చైర్మన్ డాక్టరు డీవీజీ శంకరరావు ఆదివారం ఆరా తీశారు. ఈ ఘటనను ఆయన తీవ్రంగా ఖండించారు. సంఘటన వివరాలను, బాధిత బాలిక ఆరోగ్య పరిస్థితిని అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఇటువంటివి పునరావృతం కాకుండా చూడాలన్నారు.

బాధిత చిన్నారికి మెరుగైన చికిత్స అందించాలి

విజయనగరం దాసన్నపేట: జిల్లాలోని రామభద్రపురంలో జరిగిన చిన్నారిపై జరిగిన అత్యాచారంపై చిన్నారికి మెరుగైన వైద్య చికిత్స అందించాలని రాష్ట్ర బాలల హక్కుల కమిషన్ చైర్మన్ కేసలి అప్పారావు వైద్యులను ఆదేశించారు. జరిగిన ఘటనపై ఘోషాసుపత్రి పర్యవేక్షణాధికారిని డాక్టరు అరుణాశుభశ్రీ, రామభద్రపురం పోలీసు అధికారులతో సంఘటనపై వివరాలు అడిగి తెలుసుకున్నారు. తక్షణమే అధికారులు కఠిన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.

టీడీపీ పార్లమెంటు సమన్వయ కమిటీ సమావేశం

● బాలికపై జరిగిన ఘటనను ఖండించిన కమిటీ


టీడీపీ పార్లమెంటు సమన్వయ కమిటీ సమావేశంలో పాల్గొన్న నేతలు

విజయనగరం (ఆంధ్రజ్యోతి): రామబద్రాపురం మండలంలో శనివారం ఆరు నెలల పాపపై జరిగిన అఘాయత్యంపై జిల్లా టిడిపీ పార్లమెంటు సమన్వయ కమిటీ సమావేశంలో కమిటీ సభ్యులంతా తీవ్రంగా ఖండించారు. ఎన్నికల్లో ఎన్డీయే కూటమి ప్రభుత్వం వచ్చిన తరువాత నిర్వహించిన ఈతొలి సమావేశం జిల్లా టిడీపీ పార్టీ అధ్యక్షుడు కిమిడి నాగార్జున అధ్యక్షతన జరగ్గా.. పొలిట్ బ్యూరో సభ్యులు, కేంద్ర మాజీమంత్రి పూసపాటి అశోక్ గజపతిరాజు హాజరయ్యారు. ఈసమావేశంలో మొదటగా ఎన్డీయే కూటమిని భారీమెజార్టీతో గెలిపించిన ప్రజలకు, నాయకులు, కార్యకర్తలకు కృతజ్ఞతలు తెలుపుతూ తీర్మానం చేశారు. గత 5 సంవత్సరాల పాలనలో జిల్లాలో అభివృద్ధిని పట్టించుకోలేదని, తోటపల్లి కాలువలో పూడికతీతలో నిర్లక్ష్యం వహించి రైతులకు తీవ్రనష్టం చేశారని ఆగ్రహం వ్యక్తంచేశారు. ప్రస్తుతం పూడిక తీతలు చేపట్టి, చివరి సెంటుభూమి వరకు నీరుఅందేలా చూడాలని, విజయనగరం పట్టణానికి తాగునీరు సరఫారా చేసేలా చర్యలు తీసుకోవాలని ప్రతిపాదించారు. గత ప్రభుత్వంలో అన్ని రంగాలు విధ్వంసం చేశారని, వీటినంటికీ పరిష్కారం చూపాలని తీర్మాణం చేశారు. బొత్సవాని వలసకు చెందిన గొట్టాపు శంకరావు లడక్‌లో విధులు నిర్వహిస్తున్న మరణించిన బాడంగి మండలం, బొత్సవాని వలసకు చెందిన గొట్టాపు శంకరావు జవాన్ మృతికి కమిటీ సంతాపం తెలిపింది. జిల్లాలో జరుగుతున్న పలు అభివృద్ధి కార్యక్రమాలపై అశోక్ మాట్లాడుతూ గత ప్రభుత్వం మాదిరిగా కాకుండా నిర్ణీత సమయంలో, నాణ్యత లోపించకుండా పనులు జరిపించాలని కమిటీలో తెలిపారు. సమావేశంలో మంత్రి కొండపల్లి శ్రీనివాస్, టీడీపీ జాతీయ ఉపాధ్యాక్షులు కావలి ప్రతి భా భారతి, ఎమ్మెల్యేలు బేబినయాన, అదితి, పార్లమెంట్ ప్రధాన కార్యదర్శి ఐవీపీ రాజు, టీడీపీ నేతలున్నారు.

టీటీడీ చైర్మన్ పదవిని దళితులకు ఇవ్వాలి

శృంగవరపుకోట: టీడీడీ చైర్మన్ పదవిని దళితులకు ఇవ్వాలని దక్షణ భారత కాపు సంఘం అధికార ప్రతినిధి ఒబ్బిన సన్యాసినాయుడు కూటమి ప్రభుత్వాన్ని కోరారు. ఇదే విషయాన్ని సౌత్ ఇండియన్ కాపు సంఘం ప్రధాన కార్యదర్శి వేల్పూరి శ్రీనివాసరావు సీఎం చంద్రబాబు నాయుడు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్‌కు లేఖ రాశారన్నారు. గత వైసీపీ ప్రభుత్వం కేవలం బంధువులకు మాత్రమే కీలక పదవులు కట్టబెట్టారని గుర్తుచేశారు.

లైట్ మోటారు వెహికల్ వర్కర్స్ యూనియన్ నూతన కార్యవర్గం

బొబ్బిలి: స్థానిక శ్రీవేణుగోపాల కల్యాణమండపంలో ఆదివారం లైట్ మోటారు వెహికల్ వర్కర్స్ యూనియన్ నూతన కార్యవర్గం ఎన్నిక జరిగింది. సంఘం అధ్యక్షునిగా పల్లా వెంకటరమణ, ఉపాధ్యక్షునిగా నడుకూరి గోపి, కార్యదర్శులుగా టి.ఆనంద్, ఎం.శివ, కోశాధికారిగా సన్యాసిరావుతో పాటు కార్యవర్గసభ్యులుగా ఆదినారాయణ, ఈశ్వరరావు, కన్నారావు, లక్ష్మణరావు, సురేష్, సంతోష్, వేణుగోపాలరావు, ప్రసాద్, రాంబాబులను ఎన్నుకున్నారు.

మొక్కలు నాటాలి

శృంగవరపుకోట: అటవీశాఖ సహకారంతో మొక్కలు నాటాలని తీర్మాణించినట్లు ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ సబ్ డిస్ట్రిక్ట్ ఎస్.కోట బ్రాంచి చైర్మన్ డాక్టర్ పి.వరలక్ష్మి తెలిపారు. ఆదివారం శృంగవరపుకోట పట్టణంలో రెడ్ క్రాస్ సొసైటీ సమావేశం నిర్వహించారు. విద్యార్థులకు రెడ్‌క్రాస్ చేపడుతున్న కార్యక్రమాలను వివరిస్తామన్నారు. సభ్యులు డి.సూర్యారావు, ఏ.మల్లేశ్వరరావు, జి.ధనంజయ్ వున్నారు.

మాజీ సీఎం జగన్‌పై కేసు అన్యాయం

శృంగవరపుకోట: మాజీ సీఎం జగన్‌పై అక్రమంగా టీడీపీ ఎమ్మెల్యే రఘురామ కృష్ణంరాజు కేసు పెట్టడం అన్యాయమని ఎస్.కోట మాజీ ఎమ్మెల్యే కడుబండి శ్రీనివాసరావు అన్నారు. ఆదివారం స్థానిక వైసీపీ కార్యాలయంలో విలేకర్లతో మాట్లాడారు. రఘురామకృష్ణం రాజు తాజాగా జగన్‌పై ఎఫ్ఐఆర్ నమోదు చేయడం ఎంతవరకు సమంజసమన్నారు. జడ్పీటీసీ వెంకటలక్ష్మి, వైస్‌ఎంపీపీ పినిశెట్టి వెంకటరమణ, వెంకటరావు తదితరులున్నారు.

ఘనంగా పశువులమ్మతల్లి పండగ

వేపాడ: మండలంలోని బల్లంకి గ్రామంలో ఆదివారం గ్రామస్థులు గ్రామదేవత పశువులమ్మతల్లి అమ్మవారి పండగను ఘనంగా నిర్వహించుకున్నారు. గ్రామ సర్పంచ్ బల్లంకి గ్రామ పెద్దలు, యువకులు మహిళలు అధిక సంఖ్యలో పాల్గొని అమ్మవారికి పసుపు కుంకాలు సమర్పించుకోవడంతో పాటు మొక్కులు చెల్లించుకున్నారు. గ్రామ సర్పంచ్ వరలక్ష్మి, కనకరాజు, గ్రామ పెద్దలు ధనంజయ్, వార్డు సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

పెనుబాకలో మినరల్ వాటర్ ప్లాంట్

రాజాం: మండలం పెనుబాక గ్రామంలో ప్రజల తాగునీటి అవసరాల నిమిత్తం బండి సత్యవతి జ్ఞాపకార్థం రూ.2 లక్షలు విలువ చేసే మినరల్ వాటర్ ప్లాంట్‌ను ఆదివారం కుటుంబ సభ్యులు సహకారంతో ఏర్పాటు చేశారు. గ్రామపెద్దలు, ప్రజలు కుటుంబ సభ్యులు సమక్షంలో గ్రామ సచివాలయం వద్ద ప్రారంభించారు. ప్రతి రోజూ ప్రతి ఇంటికి 20 లీటర్లు చొప్పు మినరల్ వాటర్‌ను సరఫరా చేస్తారని జడ్పీటీసీ సభ్యులు బండి నర్సింహులు తెలిపారు. కార్యక్రమంలో సర్పంచ్ బండి బోడమ్మ, బింగి కృష్ణ, చీడి జగన్నాథం, చీడి కుమార్, గంగు ఈశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.



శివారు భూములకు సాగు నీరందాలి

● ఎమ్మెల్యే కోండ్రు మురళి ● మడ్డువలస సాగు నీటి విడుదల


నీరు విడుదల చేస్తున్న ఎమ్మెల్యే కోండ్రు

వంగర, జూలై 14: శివారు ప్రాంత భూములకూ సాగునీరందించాలనే లక్ష్యంతో టీడీపీ కూటమి ప్రభుత్వం పనిచేస్తుందని రాజాం ఎమ్మెల్యే కోండ్రుమురళి అన్నారు. ఆదివారం మడ్డువలస రిజర్వాయర్ కుడికాలువద్వారా ఖరీఫ్‌కు సాగునీరు విడుదలచేశారు. ముందుగా ప్రధాన గేట్ల వద్ద ప్రత్యేక పూజలు చేసి గేట్లు మోటార్లు స్విచ్ ఆన్ చేశారు. కాలువలో వదిలిన నీటికి పసుపు కుంకుమతో పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా అయన మాటాడుతు రైతుల సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయమన్నారు. గతంలో ముఖ్యమంత్రిగా ఉన్న చంద్రబాబు మడ్డువలస రెండోదశ విస్తరణకు నిధులు విడుదలచేశారని, రెండవదశలో లావేరు, పొందూరు, జి సిగడాం మండలాల్లో కాలువలు పొడిగించి మడ్డువలసను 50 కిలో మిటర్ల దూరానికి విస్తరించారన్నారు. ఇప్పటిఏ కాలువలు తవ్వకాలు పూర్తికాగా సిమెంట్ పనులు కొన్నిచోట్ల చేపట్టవలసి ఉందని వాటిని త్వరితగతిన పూర్తిచేసేలా చర్యలు తీసుకుంటానన్నారు. మడ్డువలస రిజర్వాయర్‌లో నీరు పుష్కలంగా ఉందని రైతులకు ఖరీఫ్‌లో ఇబ్బందిలేకుండా నీరు అందించటానికి సిబ్బంది సిద్ధంగా ఉన్నారన్నారు. కాలువద్వారా ముందుగా 100 క్యూసెక్కులు నీరు విడుదలచేయగా క్రమంగా కాలువ ద్వారా నీరు విడుదల సామర్థ్యం పెంచి 750 క్యూసెక్కులు విడుదల చేస్తారన్నారు.

● **మరమ్మతుల పూర్తికి చర్యలు**

మడ్డువలస రిజర్వాయర్ ప్రధాన గేట్లు మరమ్మతులో పాటు మడ్డువలస గ్రామ సమీపములో ప్రదాన కాలువ సిపేజ్ రాకుండా వెంటనే చర్యలు తీసుకునేవిదంగా చర్యలు తీసుకుంటానన్నారు. అలాగే ప్రదాన గేట్లు రోప్ మరమ్మతులు, డాం పై విద్యుత్ దీపాలు ఏర్పాటు వంటి వాటికి నిధుల విడుదలకు అదికార్లతో చర్చించి నిదులు మంజూరుకు కృషిచేస్తానన్నారు.

● **అధికార్లతో సమావేశం**

మడ్డువలస నీరు విడుదల అనంతరం ఎమ్మెల్యే అధికారులతో సమావేశం నిర్వహించారు. వరదల సమయంలో ముంపునకు గురై గ్రామాల సమస్యలు ప్రజలు పదేపదే చెపుతున్నారని దానికి పరిష్కారంపై చర్చించారు. గతంలో ప్రధాన గేట్లు మరమ్మతుల వలస సమస్య ఉండేదని, ఇప్పుడు ఆ పరిస్థితి లేదన్నారు. ప్రోజెక్టు ఈఈ మన్మధరావు, డీఈ జగదీష్, ఎఈ లు నితిన్, సుమన్‌తో పాటు వంగర, రాజాం టీడీపీ నాయకులు బొత్సవాసుదేవ రావునాయుడు, ఎల్ కృష్ణమూర్తి, మురళికృష్ణ, శ్రీను రవి తదితరులున్నారు.

సభ్యుత్వ నమోదు చేపట్టాలి


మాట్లాడుతున్న సురేష్‌బాబు

రాజాం రూరల్, జులై 14: జనసేన పార్టీ అధినేత, ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ ఆదేశాల మేరకు రాజాం నియోజకవర్గంలో క్రియాశీలక సభ్యత్వ నమోదును కొనసాగించాలని ఆ పార్టీ ప్రచారకమిటీ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి పొగిరి సురేష్ బాబు పిలుపునిచ్చారు. పార్టీ కార్యకర్తలు, నాయకులు, అభిమానులు ఇందుకోసం నిరంతరం కృషి చేయాలని అయన కోరారు. ఇక్కడి ఓ ప్రయివేటు కల్యాణ మండపంలో ఆదివారం నిర్వహించిన నియోజకవర్గ స్థాయి సమావేశంలో ఆయన పాల్గొన్నారు. ఈనెల 18 నుంచి 28 వరకూ క్రియాశీలక సభ్యుత్వ నమోదు కార్యక్రమం నిర్వహించేలా పార్టీ అధినేత నిర్ణయం తీసుకున్నారని ఆయన స్పష్టం చేశారు. సభ్యత్వ నమోదు ప్రక్రియలో ప్రతి ఒక్కరూ కీలకంగా వ్యవహరించడం ద్వారా రాజాం నియోజకవర్గంలో పార్టీ బలోపేతం చేసేందుకు కృషి చేయాల్సి ఉందన్నారు. క్రియాశీలక కార్యకర్త ప్రమాదవశాత్తూ మృతి చెందితే రూ.5 లక్షలు మృతుడి కుటుంబానికి పార్టీ అందజేస్తుందని ఆయన గుర్తు చేశారు. అంగవైకల్యం ఏర్పడితే రూ.50 వేలు పార్టీ అందజేస్తుందన్నారు. ఈ సందర్భంగా నియోజకవర్గ పరిధిలోని నాలుగు మండలాలతో పాటు రాజాం మున్సిపాలిటీకి సంబంధించి అయిదుగురు ఇన్‌ఛార్జిలను నియమించారు. నాలుగు మండలాల నాయకులు ఉన్నారు.

జీపీఎస్‌పై గజిట్ విడుదల దారుణం


రాజాం, బొబ్బిలిలో నిరసన తెలుపుతున్న యూటీఎఫ్ నాయకులు

రాజాం జూలై 14: సీపీఎస్ రద్దుచేసి పాతపెన్షన్ విధానాన్ని పునరుద్ధరించాలన్నదే ఉద్యోగ ఉపాధ్యాయ ఆకాంక్ష అని ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ రాష్ట్ర కార్యదర్శి రెడ్డి మోహన్‌రావు అన్నారు. ఇందుకు విరుద్ధంగా గత ప్రభుత్వం జీపీఎస్‌ను అమలు చేస్తామని చెప్పినా తమ పోరాటాల ఫలితంగా తాత్కాలికంగా జీవోను విడుదల చేయలేదని గుర్తుచేశారు. కానీ నేటి నూతన ప్రభుత్వం పాత తేదీతో జీపీఎస్ విధానాన్ని అమలు చేస్తూ రాజపత్రాన్ని విడుదల చేయడం దుర్మార్గమని యూటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి రెడ్డి మోహన్‌రావు ఒక ప్రకటనలో తీవ్రంగా ఖండించారు. ఈ నేపథ్యంలో ఆదివారం రాజాం డివిజన్ యూటీఎఫ్ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన నిరసన కార్యక్రమంలో మోహన్‌రావు మాట్లాడుతూ గత ఏడాది అక్టోబరు నుంచి సీపీఎస్ ఉద్యోగులు అందరూ జీజీఎస్‌లోకి తీసుకువస్తూ రాజపత్రం ఇప్పుడు విడుదల చేయడం ఏమిటని ఆయన ఆక్షేపించారు. ఈ జీవోని విడుదల చేసిన ప్రస్తుత ప్రభుత్వం ఉద్యోగ ఉపాధ్యాయులను మోసగించిందన్నారు. ఈ రాజపత్రాన్ని తక్షణమే రద్దు చేయాలని, పాత పెన్షన్ విధానాన్ని పునరుద్ధరించడానికి సత్వర చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. అనంతరం 54 నెంబరు జీవో కాపీలను దగ్ధం చేశారు. యూటీఎఫ్ జిల్లా కార్యదర్శి బి రామినాయుడు, జిల్లా ఆడిట్ కమిటీ సభ్యుడు మారెళ్ల కృష్ణమూర్తి, తదితరులు పాల్గొన్నారు.

బొబ్బిలి: సీపీఎస్ ఉద్యోగులకు జీపీఎస్ అమలు చేస్తూ గెజిట్ నోటిఫికేషన్‌ను విడుదల చేయడాన్ని నిరసిస్తూ ఏపీటీఎఫ్ ఆధ్వర్యంలో ఆదివారం సాయంత్రం స్థానిక గాంధీవిగ్రహం ముందు గజిట్ ప్రతులను దగ్ధం చేసి తమ నిరసనను తెలియ చేశారు. ఈ సందర్భంగా ఆ సంఘం రాష్ట్ర అకడమిక్ కన్వీనర్ జేసీ రాజు మాట్లాడుతూ సీపీఎస్‌ను రద్దు చేసి పాత పెన్షన్ విధానాన్ని అమలు చేయకుండా జీపీఎస్ అమలు కోసం గజిట్ పబ్లికేషన్ చేయడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. ఇది ముమ్మాటికీ ఉద్యోగులను మోసగించడమేనన్నారు. ఈ రాజపత్రాన్ని తక్షణమే రద్దు చేయాలని డిమాండ్ చేశారు. జీవో 54 ద్వారా జీపీఎస్‌ను అమలు చేస్తామని అప్పటి ప్రభుత్వం ప్రకటించినప్పుడు పోరాటాలతో దానిని అడ్డుకున్నామన్నారు. 2017లో కేంద్రప్రభుత్వం ఇచ్చిన 57 మెమోని అమలు చేయాలని, 2003 డీఎస్సీ టీచర్లందరికీ పాత పెన్షన్ విధానాన్ని వర్తింపజేయాలని ఆమె డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఏపీటీఎఫ్ నాయకులు సీహెచ్‌జే ప్రవీణ్‌కుమార్, రామకృష్ణ, ల్మణరావు, జనార్దనరావు, పరశునాయుడు, తిరుపతిరావు, శ్రీనివాసరావు, పాణిగ్రాహి, మురళి, దాలినాయుడు తదితరులు పాల్గొని నినాదాలు చేశారు.

పురుగుమందు తాగి వ్యక్తి ఆత్మహత్య

వంగర, జూలై 14: పురుగుమందు తాగి వ్యక్తి ఆత్మహత్య చేసుకున్న ఘటన మండలంలో చోటు చేసుకుంది. దీనికి సంబంధించి స్థానికులు, ఎస్ఐ జనార్దన్ తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. మండలంలోని రాజులగుమ్మడకు చెందిన రెడ్డి కృష్ణ(46) వ్యవసాయం చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. శనివారం ఉదయం తమ మొక్కజొన్న పంటకు గడ్డి మందు పిచికారి చేయటానికి బయలుదేరి వెళ్లాడు. కానీ సాయంత్రం వరకూ ఇంటికి తిరిగి రాకపోటంతో కుటుంబసభ్యులు కంగారుపడ్డారు. పొలంలో వెతుకులాట సాగించారు. ఐనా ఫలితం లేకపోగా ఆదివారం ఉదయం కుటుంబసభ్యులు వెతకగా కొంత దూరంలో ఉన్న చెరుకుతోటలో కృష్ణ పురుగులమందు తాగి పడి ఉండటాన్ని గమనించారు. వెంటనే భార్య భవానితో పాటు పిల్లలకు సమాచారం అందించారు. దీంతో భార్య పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఎస్సై జనార్దన్ కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నారు. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని పార్వతీపురం ఏరియా ఆసుపత్రికి తరలించారు.

అంబులెన్స్ బోల్తా.. ముగ్గురికి తీవ్ర గాయాలు

బొండపల్లి: అంబులెన్స్ బోల్తాపడి ముగ్గురికి తీవ్ర గాయాలైన ఘటన మండలంలో చోటు చేసుకుంది. దీనికి సంబంధించి స్థానికులు, పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. గుమ్మలక్ష్మీపురం మండలం బిన్నిడి గ్రామానికి చెందిన నల్లా భాగ్యలక్ష్మి(60) ఇటీవల అనారోగ్య కారణంగా విజయనగరంలోని ఒక ప్రైవేటు ఆసుపత్రిలో చేరి, చికిత్స పొందుతూ ఆదివారం మృతి చెందింది. దీంతో అదే ఆసుపత్రికి చెందిన అంబులెన్స్‌లో మృతదేహాన్ని స్వగ్రామం తరలిస్తుండగా ఆదివారం తెల్లవారుజామున నెలివాడ జంక్షన్ సముదాయానికి సమీపాన అంబులెన్స్ బోల్తాపడింది. దీంతో మృతురాలి కుటుంబ సభ్యులు నల్లా రవికుమార్, పుష్పలత, మేనకోడలు శ్రీలతకు తీవ్ర గాయాలయ్యాయి. హైవే పెట్రోలింగ్ సిబ్బంది, స్థానిక ఎస్ఐ కే.లక్ష్మణరావు ఘటనా స్థలానికి చేరుకుని క్షతగాత్రులను 108లో విశాఖ కేజీహెచ్‌కు తరలించారు. అనంతరం ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరించి మృతదేహాన్ని స్వస్థలానికి చేరేలా చర్యలు చేపట్టారు. ఘటనపై ఎస్ఐ కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి..

భోగాపురం: రోడ్డు ప్రమాదంలో భార్యాభర్తలు తీవ్ర గాయాలపాలైన ఘటన మండలంలో చోటు చేసుకుంది. దీనికి సంబంధించి స్థానికులు, ఎస్ఐ సూర్యకుమారి తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. సవరవల్లికి చెందిన భార్యాభర్తలు బండిబోయిన పైడిరాజు, బండిబోయిన సిరపయ్య గొర్రెలు మేపుకుంటూ జీవనాధారం పొందుతున్నారు. ఇందులో భాగంగా ఎప్పటి మాదిరిగానే శనివారం రాత్రి గొర్రెలను మేపుకుని శ్రీకాకుళం వైపునుంచి విశాఖపట్నం వైపు వెళ్లే సర్వీసు రహదారిలో గొర్రెలు తోలుకుంటూ ఇంటికి వెళ్తున్నారు. అయితే సవరవల్లి సమీపానికి వచ్చే సరికి అదే రహదారిలో ఎయిర్‌పోర్టు పనుల్లో భాగంగా రాకపోకలు సాగిస్తున్న ప్రైవేటు బస్సు ఇద్దరినీ వెనుక నుంచి ఢీకొంది. దీంతో భార్య పైడిరాజుకు తీవ్రగాయాలు కాగా భర్త సిరపయ్యకు గాయాలయ్యాయి. దీంతో ఇద్దరిని చికిత్స నిమిత్తం విశాఖ ప్రైవేటు ఆసుపత్రికి తరలించగా అక్కడ చికిత్స పొందుతున్నారని దీనిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ పి.సూర్యకుమారి తెలిపారు.

తాటిపూడిలో గుర్తు తెలియని మృతదేహం

గంట్యాడ: తాటిపూడి రిజర్వాయర్‌లో గుర్తు తెలియని మృతదేహాన్ని గుర్తించినట్టు ఎస్ఐ బి.సురేంద్రనాయుడు ఆదివారం తెలిపారు. వివరాలు ఇలా ఉన్నాయి. తాటి పూడి రిజర్వాయర్‌లో ఆదివారం ఓ ఒడ్డున మృతదేహం కనిపించడంతో స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు. పోలీసులు వెంటనే ఘటనా స్థలానికి వెళ్లి, మృతదేహాన్ని బయటకు తీశారు. మృతుడి వివరాలు లభ్యం కాలేదు. మృతదేహాన్ని మహరాజా ఆస్పత్రికి తరలించారు. రిజర్వాయర్ గట్టు వద్ద మృతుడికి సంబంధించి తువ్వాలు, చెప్పులు, దువ్వెన దొరికాయి. మృతుడి వయస్సు 45 నుంచి 50 సంవత్సరాలు ఉండవచ్చని భావిస్తున్నారు.

ఘనంగా అయ్యప్పస్వామి పూజలు


వాల్ పోస్టర్లను ఆవిష్కరిస్తున్న దృశ్యం

విజయనగరం దాసన్నపేట: నగరంలోని అంబటి సత్రర్వు సమీపంలోని జగదీష్ బాబు గురుస్వామి పీఠం ఆధ్వర్యంలో అయ్యప్పస్వామికి పూజలు నిర్వహించారు. గురుస్వామి ఆధ్వర్యంలో స్వామి అయ్యప్ప చారిటబుల్ ట్రస్టు ప్రారంభించారు. ఈ సందర్భంగా జగదీష్ బాబు మాట్లాడుతూ ఇప్పటికీ తాను 139 సార్లు గురుస్వామిగా, వ్యవహరించి స్వాములకు ఆదర్శంగా నిలిచానన్నారు. ప్రముఖ ఆడిటర్ గోవిందరామ్, జిల్లా శిష్టకరణం సంఘం అధ్యక్షుడు ఎంపీజీ ఈశ్వరరావు, పిల్లా వెంకట సూర్యం, మజ్జి శివకుమార్, అప్పాజీ, శ్రీధర్, లక్ష్మణరావు, సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

ఎంవీజీఆర్‌లో ముగిసిన డీఎస్‌టీ కార్యక్రమం


డీఎస్‌టీ కార్యక్రమంలో పాల్గొన్న కళాశాల అధ్యాపకులు

విజయనగరం (ఆంధ్రజ్యోతి), జూలై 14: విజయనగరంలోని ఎంవీజీఆర్ కళాశాలలో డేటా ఇంజినీరింగు విభాగం స్పాన్సర్ చేసిన ఇంటెలిజెన్స్ సైబర్ ఫిజికల్ సిస్టమ్ డెవలప్‌మెంట్ ప్రోగ్రాం ఆదివారం విజయవంతంగా ముగిసింది. వ్యాలిడేటరీ ఫంక్షన్ ద్వారా పూర్తిగా ఆసక్తికరమైన సెషన్స్ ప్రాక్టికల్ వర్క్‌షాపు ముగిసింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా కళాశాల ఐక్యూఏసీ కన్వీనర్ డాక్టరు నాగేష్ మాట్లాడుతూ, ఇటువంటి ఫ్యాకల్టీ పార్టిసిపెంట్స్ కార్యక్రమాలు ఎంతో ఉపయోగకరమన్నారు. సాంకేతికపరమైన అంశాలపై అవగాహన పెంపొందించుకో వచ్చునన్నారు. ఈ టెక్నాలజీ తాజా అభివృద్ధిని తెలుసుకోవడం కోసం ఎంతో ఉపయోగపడుతుందన్నారు. కార్యక్రమంలో డాక్టరు పి.శ్రీనివాసరావు, ప్రిన్సిపాల్ డాక్టరు ఆర్ రమేష్, సీతారామరాజు, సతీష్ తదితరులు పాల్గొన్నారు.

టీడీపీతోనే రజకుల అభివృద్ధి

విజయనగరం దాసన్నపేట, జూలై 14: రాష్ట్రంలో రజకుల అభివృద్ధి తెలుగుదేశం, కూటమి ప్రభుత్వంతోటే సాధ్యమని రజక సాధికారిక విజయనగరం పార్లమెంటు కన్వీనరు గురజాపు రాము, మరిశర్ల చిట్టితల్లిలు అన్నారు. ఆదివారం అంబేడ్కర్ భవనంలో జరిగిన రజక సాధికారిక కమిటీ సమావేశంలో వారు మాట్లాడుతూ, వైసీపీ పాలనలో రజకులపై దాడులు, దౌర్జన్యాలు, గ్రామ బహిష్కరణలు తప్ప అభివృద్ధి జరగలేదన్నారు. జరిగిన సార్వత్రిక ఎన్నికల్లో రజకులు అంతా కూటమి అభ్యర్థులకు మద్దతు ఇచ్చారన్నారు. రానున్న రోజుల్లో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు రజకుల సమస్యలు పరిష్కరిస్తామని ఆశాభావం వ్యక్తం చేశారు. కమిటీ సభ్యులు రామారావు, సత్యం, అప్పలస్వామి, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

సాజావుగా నిర్వహించుకోవాలి

వేపాడ: మండలంలోని బల్లంకి గ్రామంలోని పాల కేంద్రం ఎన్నికలు ప్రశాంతంగా నిర్వహించేందుకు పాడి రైతులు, గ్రామస్థులు సహకరించాలని వల్లంపూడి ఎస్ఐ కే.రాజేష్ అన్నారు. గ్రామంలోని పాల కేంద్రం వద్ద ఆదివారం గ్రామ పెద్దలు, పాడి రైతులు తదితరులతో సమావేశం నిర్వహించారు. ఈ సంద ర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామ పెద్దలు, పాడి రైతులు ఆ ఎన్నికలు ప్రశాంతంగా నిర్వహించేందుకు సహకరించాలన్నారు.

చక్కెర కర్మాగారంపై నిర్ణయం తగదు

జామి, జూలై 14: భీమసింగి చక్కెర కర్మాగారంపై రెండురోజుల క్రితం మండలంలోని లోట్లపల్లి గ్రామంలో పర్యటించిన మంత్రి శ్రీనువాస్ ప్రకటన ఆశ్చర్యం కలిగించిందని భీమసింగి సుగర్స్ మాజీ చైర్మన్ గుల్లిపల్లి లలిత ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. గత ఎన్నికల సమయంలో టీడీపీ ఆదికారంలోకి వస్తే భీమసింగి చక్కెర కర్మాగారం తెరుస్తామని చెప్పిన వారు ఇప్పుడు ఈ పరిశ్రమ తెరిస్తే నష్టాలు వస్తాయని చెప్పడం రైతులను అన్యాయం చేయడమే అన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడుతో చర్చించకుండా ఈనిర్ణయం ప్రకటించడం తమను బాధకల్గిస్తుందని వాపోయారు.

ఆంధ్రప్రదేశ్ ఉద్యోగుల ఎస్.కోట తాలుకా సంఘం ఎన్నిక

జామి, జూలై 14: ఆంధ్రప్రదేశ్ ఉద్యోగుల సంఘ ఎస్.కోట తాలుకా సంఘ ఎన్నికలను ఆదివారం మండలంలోని భీమసింగి భార్గవ్‌హెల్ప్‌లైన్ కార్యాలయంలో నిర్వహించారు. జిల్లా సంయుక్త కార్యదర్శి ముదిలి ఆదినారాయణ, పెనుమత్స మేరి ఎన్నికల అధికారులుగా వ్యవహరించిన ఈఎన్నికల్లో నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. సంఘ అధ్యక్షుడుగా ఎస్.సత్యన్నారాయణ, సహా అధ్యక్షుడిగా ముత్యాలమ్మ, కార్యదర్శిగా పడాల వెంకటరమణను ఎన్నుకున్నారు.

ఘనంగా దేశమ్మతల్లి వారాలు

బాడంగి: మండలంలోని ఎరుకులపాకలు గ్రామంలో దేశమ్మతల్లి వారాలను రాష్ట్ర ఎస్టీ సెల్ జనరల్ సెక్రటరీ పాలవలస గౌరు ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. గ్రామంలోని 120 కుటుంబాలు అమ్మతల్లులు, పూజారుల తో ఆనందోత్సాహాల మధ్య పండుగను నిర్వహించారు.

భారీ వాహనాలతో బేజారు

- పార్వతీపురం-పాలకొండ రోడ్డులో నిత్యం రాకపోకలు
- మరమ్మతులకు గురవుతున్న రహదారులు
- ప్రమాదాలకు ఆస్కారం.. వాహనదారుల్లో ఆందోళన
- స్తంభిస్తున్న ట్రాఫిక్.. ఇబ్బందులు పడుతున్న ప్రయాణికులు

గరుగుబిల్లి: పార్వతీపురం నుంచి పాలకొండ వైపు వెళ్లే ప్రధాన రహదారి మార్గంలో ప్రయాణం చేసే వాహనదారుల్లో ఆందోళన నెలకొంది. బొబ్బిలి సమీపంలోని పారాది వంతెన పనులు పూర్తి కాకపోవడంతో భారీ వాహనాలు పార్వతీపురం నుంచి గరుగుబిల్లి, కొమరాడ, పాలకొండ వైపు రాకపోకలు సాగిస్తున్నాయి. దీంతో రహదారులు మరమ్మతులకు గురవుతున్నాయి. మరోవైపు ప్రమాదాలు నెలకొంటున్న పరిస్థితి ఏర్పడింది. పార్వతీపురం నుంచి ఉల్లిభద్ర వరకు ఉన్న రహదారి, అలాగే కొమరాడ వైపు ఉన్న రహదారి భారీ స్థాయిలో గోతులమయమయ్యాయి. దీంతో రహదారి మధ్యలో భారీ వాహనాలు నిలిచిపోవడంతో రాకపోకలకు తీవ్ర అంతరాయం కలుగుతోంది. మితిమీరిన బరువులతో వాహనాలు రాకపోకలు సాగిస్తుండటంతో ఏ నిమిషం ప్రమాదం సంభవిస్తుందోనని వాహనదారులు ఆందోళన చెందుతున్నారు. ఉల్లిభద్ర సమీపంలో భారీ వాహనాలను నిలిపివేయడంతో రాకపోకలకు అంతరాయం ఏర్పడుతోంది. పాఠశాలలకు వెళ్లే వారు, అలాగే ప్రయాణం చేసేందుకు బస్సుల కోసం నిరీక్షణ చేసేవారు భారీ వాహనాలతో ఆందోళన చెందుతున్నారు. రాత్రి సమయాల్లో భారీ వాహనాల రాకపోకలు సాగించేలా అవసరమైన చర్యలు చేపట్టడంతో పాటు పరిమితికి లోబడి ఉన్న వాటినే రహదారులపైకి వెళ్లేలా దృష్టి సారించాలని పలువురు కోరుతున్నారు.



ఉల్లిభద్ర సమీపంలో రాకపోకలు సాగిస్తున్న భారీ వాహనాలు

నిందితుడిని కఠినంగా శిక్షించాలి

- మంత్రి సంధ్యారాణి



మాట్లాడుతున్న మంత్రి

సాలూరు: పసికందుపై అత్యాచారానికి పాల్పడిన వ్యక్తిని కఠినంగా శిక్షించాలని, న్యాయవాదులు వారికి సహకరించవద్దని మంత్రి గుమ్మిడి సంధ్యారాణి కోరారు. ఆదివారం ఉదయం సాలూరులోని తన నివాసంలో ఆమె స్థానిక విలేకర్లతో మాట్లాడారు. రామభద్రపురం మండలం జిలుగువలస గిరిజన గ్రామంలో సభ్యసమాజం తలదించుకునేలా మానవ మృగంలా ప్రవర్తించిన వ్యక్తిని కఠినంగా శిక్షించాలని కోరారు. ఐదు నెలల పసికందుపై అత్యాచారం చేసిన వైనం తనను తీవ్ర దిగ్భ్రాంతికి గురి చేసిందని అన్నారు. ఈ విషయంపై న్యాయవాదులు చాలా సీరియస్‌గా తీసుకోవాలని కోరారు. ఇలాంటి వ్యక్తులు సమాజంలో తిరిగే అవకాశం లేదన్నారు. ఎవ్వరూ కూడా బెయిల్ ఇవ్వవద్దని కోరారు. ఇటువంటి ఘటనలు పునరావృతం కాకుండా కఠిన చర్యలు తీసుకోవాలని ఆమె ఆదేశించారు.

తప్పిన పెను ప్రమాదం

- వర్షాలకు కూలిన రెండు ఇళ్లు



కూలిన ఇంటి పైభాగం, ధ్వంసమైన మరో ఇల్లు

గుమ్మలక్ష్మీపురం: గత రెండు రోజులుగా కురుస్తున్న భారీ వర్షాలకు గుమ్మలక్ష్మీపురం గ్రామంలోని గ్రామీణ బ్యాంకు వీధిలో ఉన్న తంగుడు ఫకీరునాయుడు, గుంట్రెడ్డి విమలరాణికి చెందిన రెండు ఇళ్లు నేలమట్టమయ్యాయి. ఈ ఘటన ఆదివారం ఉదయం ఆరు గంటల సమయంలో జరిగింది. భారీ వర్షాల కారణంగా విమలారాణి ఇళ్లు పైభాగం ఒక్కసారిగా కూలి ఫకీరునాయుడు ఇంటిపైన పడింది. ఇది గమనించిన ఫకీరునాయుడు కుటుంబ సభ్యులు ఒక్కసారిగా అ ప్రమత్తమై భయంతో ఇంటి లోపల నుంచి బయటకు పరుగులు తీశారు. చిన్నారులు నిద్రిస్తున్న గదిలోనే పైభాగం సగం వరకు వచ్చి కూలింది. నిమిషం పాటులో పెను ప్రమాదం తప్పడంతో అంతా ఊపిరి పీల్చుకున్నారు. సుమారు రూ.3 లక్షలు ఆస్తి నష్టం ఉంటుందని భావిస్తున్నారు. ఇదే కాకుండా కూలిన ఇంటిపక్కనే రేకులషెడ్‌లో ఉన్న కారుకు కూడా చిన్నపాటి ప్రమాదం జరిగింది. విషయం తెలుసుకున్న గ్రామ సర్పంచ్ బొత్తాడ గౌరీశంకర్‌రావు, పంచాయతీ కార్యదర్శి కిషోర్‌కుమార్ సంఘటనా సలానికి వచ్చి పరిశీలించి బాధితులను పరామర్శించారు.

మందులు అందుబాటులో ఉంచాలి

సీతంపేట: అన్ని వ్యాధులకు సంబంధించి ఆసుపత్రిలో మందులు అందుబాటులో ఉంచాలని సీపీఎం జిల్లా కార్యవర్గ సభ్యుడు ఎం.తిరుపతిరావు, జిల్లా కమిటీ సభ్యుడు ఎ.భాస్కరరావు కోరారు. ఈ మేరకు ఆదివారం ఒక ప్రకటన విడుదల చేశారు. సీతంపేటలో నిర్మాణ దశలో ఉన్న సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రి అందుబాటులోకి వస్తే తప్ప ఈ ప్రాంతం గిరిజనులు ప్రాణాలకు భద్రత ఉండదన్నారు. ప్రభుత్వం త్వరితగతిన పనులు పూర్తయ్యే విధంగా దృష్టి సారించాలని ఆయన కోరారు. ఏరియా ఆసుపత్రిలో పూర్తి స్థాయి మందులు అందుబాటులో ఉంచాలన్నారు. కొన్ని మందులు అందుబాటులో లేక బయట కొనుగోలు చేయాల్సిన పరిస్థితి వస్తోందని వాపోయారు. వైద్యుడు ఇచ్చే సీటీలతో రోగులు బయట కొనుగోలు చేయడానికి ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. వెంటనే ఐటీడీఏ గవర్నింగ్ బాడీ మీటింగ్ నిర్వహించి గిరిజన ప్రాంత సమస్యలు ఆరోగ్యం, మంచినీరు, విద్య, రోడ్లు, గృహాలు వంటి సమస్యలపై చర్చ జరిపి ఆదివాసీలకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు.

అవినీతి అధికారిపై చర్యలు తీసుకోండి

గరుగుబిల్లి: గతంలో ఎంపీడీవోగా విధులు నిర్వహించే సమయంలో పలు అక్రమాలకు పాల్పడిన జి.పైడితల్లిపై చర్యలు తీసుకోవడంలో అధికారులు విఫలమయ్యారని నాగూరు ఎంపీటీసీ సభ్యుడు, టీడీపీ నాయకుడు ద్వారపురెడ్డి సత్యనారాయణ విమర్శించారు. ఆదివారం ఆయన స్థానిక విలేకర్లతో మాట్లాడారు. పైడితల్లి గతంలో ఎంపీడీవోగా చేసిన సమయంలో అనేక అక్రమాలకు, అవినీతి పాల్పడ్డారని తెలిపారు. ఆమె అక్రమాలపై రాష్ట్ర ఉన్నతాధికారులకు ఇప్పటికే ఫిర్యాదు చేశామన్నారు. కలెక్టర్‌కు కూడా ఫిర్యాదు చేస్తామని ఆయన తెలిపారు. సోమవారం స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో అధికారులతో సమీక్ష నిర్వహించనున్న ఎమ్మెల్యే జగదీశ్వరికి కూడా ఫిర్యాదు చేస్తామన్నారు. విజిలెన్స్ అధికారుల దృష్టికి తీసుకు వెళ్తామని చెప్పారు.

సూర్యపీఠంలో ప్రత్యేక పూజలు



సూర్యపీఠంలో పూజలు నిర్వహిస్తున్న నరహరశాస్త్రి

పార్వతీపురంటౌన్: పట్టణ శివారుల్లోగల సూర్యపీఠంలో లోక కల్యాణార్థం కార్యసిద్ధి రామాయణ పూజలతో పాటు సౌర హోమాలు పీఠాధిపతి వేమకోటి నరహరశాస్త్రి ఆధ్వర్యంలో జరిగాయి. ఆదివారం ఉదయం 5 గంటల నుంచి శాస్త్రి, రుత్వికుల వేదమంత్రోశ్చరణల మధ్య ఆదిత్య పంచాయతన, శ్రీసూర్యదేవునికి క్షీరాభిషేకాలు నిర్వహించారు. రాజాం జీసీఎస్ఆర్ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ పురుషోత్తం, తదితర అధ్యాపక బృందం ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా శాస్త్రి మాట్లాడుతూ భక్తి, ఆధ్యాత్మిక మార్గంలో ప్రతిఒక్కరూ పయనించాలని కోరారు.

దుగ్గిలో మహాయజ్ఞం

పాలకొండ: మండలంలోని దుగ్గి గ్రామంలో సత్యసాయిసమితి ఆధ్వర్యంలో దుగ్గి, పనుకువలస సత్యసాయి భక్తులు, గీతా భక్తుల సహాయ సహకారాలతో ఆదివారం గ్రామసేవ మహాయజ్ఞం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు. సత్యసాయి వ్రతాలు, భజన చేశారు. సత్యసాయి ప్రతినిధి ఎస్.వి.రమణ ఆధ్యాత్మిక ప్రసంగాలు నిర్వహించారు. అనంతరం నారాయణసేవ నిర్వహించారు.

'తనికెళ్లది ఓ ప్రత్యేక శైలి'



గీతాలాపన చేస్తున్న గౌరి

ఒడిశా

రాయగడ: సినీ రంగంలో తనికెళ్ల భరణిది ఓ ప్రత్యేక శైలని, నటుడిగా, దర్శకుడిగా, మాటల రచయతగా చలనచిత్ర రంగంలో తన ప్రత్యేక నటనతో ప్రేక్షలను అలరించారని స్పందన అధ్యక్షుడు జి.గౌరిప్రసాద్ అన్నారు. ఆదివారం స్థానిక స్పందన కార్యాలయంలో తనికెళ్ల భరణి జన్మదినం సందర్భంగా ఆయన అధ్యక్షతన ప్రత్యేక కార్యక్రమం నిర్వహించారు. విలన్‌గా, హాస్యనటుడిగా అనేక పాత్రలు పోషించి అలరించారన్నారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న పిల్లల శంకరరావు తనికెళ్ల భరణి సినీ ప్రస్థానంపై వివరించారు. సాంస్కృతిక కార్యదర్శి కేకేఎం పట్నాయక్ నిర్వాహణలో జరిగిన కార్యక్రమంలో కె.సుబ్రమణ్యం, పీఎంజీ శంకరరావు, ఎల్.కేశవరావు, బరాటం గౌరి, మోహనరావు, గౌరిప్రసాద్, పీఆర్ మోహన్ తదితరులు పాటలు పాడి వినిపించారు. బాలకృష్ణ పట్నాయక్ పాలిథిన్ భూతం అనే కవితను వినిపించారు. సాహితీ ప్రియులు పాల్గొన్నారు. తొలుత స్పందన సభ్యుడు, ప్రముఖ ప్రవచనకారుడు భళ్లమూడి నాగేశ్వరరావు తండ్రి బి.రామ శాస్త్రి మృతికి సంతాపం తెలిపి రెండు నిముషాలు మౌనం పాటించారు.

బుద్ధుని అవతారంలో జగన్నాథుడు



బుద్ధిని అవతారంలో జగన్నాథుడు

రాయగడ: స్థానిక గుండిచా మందిరంలో అన్న బలరాముడు, చెల్లెలు సుభద్రతో కలిసి వేంచేసియున్న జగన్నాథుడు భక్తులకు రోజుకొక అవతారంలో దర్శన భాగ్యం కల్పిస్తున్నారు. ఇందులో భాగంగా ఆదివారం స్వామివారు బుద్ధుని అవతారంలో భక్తులకు దర్శనమిచ్చారు. వందల సంఖ్యలో భక్తులు స్వామివారిని దర్శించి, తరించారు.

గ్రంథాలయం చుట్టూ ఇలా.. చదువుకునేదెలా?

- పాలకొండ శాఖా గ్రంథాలయం ఆవరణలో పేరుకుపోయిన చెత్త
- తీవ్ర ఇబ్బందులు పడుతున్న పాఠకులు

పాలకొండ: స్థానిక శాఖా గ్రంథాలయం ఆవరణ దుర్గంధ భరితంగా తయారయ్యింది. మొత్తం చెత్తా చెదారాలతో పేరుకుపోయి, తీవ్ర దుర్గంధం వెదజల్లుతోంది. డంపింగ్ యార్డ్‌గా మారింది. గ్రంథాలయానికి వచ్చే పాఠకులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ముక్కు మూసుకుని గ్రంథాలయానికి వెళ్లాల్సి వస్తోంది. ఆదివారం గ్రంథాలయంలో నిర్వహించిన చదవడం మాకిష్టం కార్యక్రమంలో పాల్గొన్న కొంతమంది పాఠకులు దీనిపై తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. కనీసం రహదారి అయినా సరిగ్గా లేదని, అక్కడే మలమూత్రాలు విసర్జన చేస్తున్నారని, చాలా అసౌకర్యానికి గురి కావల్సి వస్తోందని ఆందోళన వ్యక్తం చేశారు. ట్యాంకు నిండిన తర్వాత నీరంతా గ్రంథాలయం చుట్టుపక్కల నిలబడతుందని, ఉద్యోగాల కోసం చదువుతు న్న విద్యార్థులు గ్రంథాలయానికి ఎలా వస్తారని వారు ప్రశ్నిస్తున్నారు. ఎన్నిమార్లు సమస్యలు విన్నవించినా ఫలితం లేదన్నారు. అధికారులు, ప్రజా ప్రతినిధులు స్పందించి గ్రంథాలయానికి మోక్షం కల్పించాలని కోరుతున్నారు.



గ్రంథాలయం చుట్టూ ఉన్న చెత్తా చెదారాలతో ఉన్న దృశ్యం

జీసీసీ సబ్బుల కంపెనీ కార్మికులను ఆదుకోండి



మంత్రికి వినతిపత్రం అందజేస్తున్న దృశ్యం

సాలూరు: తమను ఆదుకోవాలంటూ జీసీసీ సబ్బుల కంపెనీ కార్మికులు మంత్రి సంధ్యారాణిని కోరారు. ఈ మేరకు ఆదివారం సాలూరులోని ఆమె నివాసా నికి వెళ్లి, వినతిపత్రం అందజేశారు. గతంలో జీసీసీలో సబ్బుల యూనిట్ల నుంచి రాష్ట్రంలో ఉన్న అన్ని వసతి గృహలకు సబ్బులను సరఫరా చేసేవారమని తెలి పారు. అయితే గత ప్రభుత్వం అమ్మ ఒడి ద్వారా నేరుగా తల్లుల ఖాతాల్లో డబ్బులు జమ చేయటం వల్ల తమ సబ్బులు సరఫరా నిలిచిపోయిందని వివరించారు. సుమారు 38మంది కార్మికులం పూర్తి స్థాయిలో పనులు లేక అరకొ ర జీతాలతో బతుకుతున్నామని, సంస్థ కూడా ఏమి చేయలేక పోతుందన్నారు. ఈ ప్రభుత్వం తమను ఆదుకోవాలని కోరారు.

ముగిసిన పశుగ్రాస వారోత్సవాలు

గరుగుబిల్లి: మండలంలో ఈనెల 7వ తేదీ నుంచి పశు సంవర్ధక శాఖ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న పశుగ్రాస వారోత్సవాలు ఆదివారంతో ముగిశాయి. ఈసందర్భంగా గరుగుబిల్లిలో నిర్వహించిన కార్యక్రమంలో మండల పశు సంవర్ధక శాఖ అధికారి సురేష్‌కుమార్ పాల్గొని, మాట్లాడారు. పాడి పశువులకు మేలు జాతి పశుగ్రాసం అందించడం వల్ల పాల ఉత్పత్తి పెరుగుతుందని తెలిపారు. పాలలో వెన్న శాతం పెరుగుతుందన్నారు. పశు సంవర్ధక శాఖ ఆధ్వర్యంలో రాయితీపై పశుగ్రాస విత్తనాలను పంపిణీ చేస్తున్నామని ఆయన తెలిపారు.

శ్మశానవాటిక స్థల సమస్యను పరిష్కరించండి

నెల్లిమర్ల: తామస్‌పేట ప్రజల శ్మశానవాటిక స్థల సమస్య విషయంలో రెవెన్యూ అధికారులు సహకరించాలని మాజీ వైస్ ఎంపీపీ చిక్కాల సాంబశివరావు, ఏఎంసీ మాజీ ఛైర్‌పర్సన్ చిక్కాల అరుణకుమారి, నగర పంచాయతీ వైస్ ఛైర్మన్‌లు సముద్రపు రామారావు, కారుకొండ కృష్ణారావు కోరారు. నెల్లిమర్లలో ఆదివారం ఏర్పాటుచేసిన విలేకర్ల సమావేశంలో వారు మాట్లాడారు. తామస్‌పేట ప్రజలు దశాబ్దాల కాలం నుంచి శ్మశానవాటిక లేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని, ఇందుకు గ్రామ సమీపంలోని చంపావతి నది ఒడ్డు న ఉన్న ఖాళీ స్థలం అనువైనదిగా గుర్తించామని తెలిపారు. ఈ విషయంలో జూట్ మిల్లు యాజమాన్యం ప్రమేయం ఏమిటని వారు ప్రశ్నించారు. రెవెన్యూ అధికారులు ఈ విషయంలో ప్రజా ప్రయోజనాన్ని దృష్టిలో పెట్టుకోవాలని అన్నారు. శ్మశానవాటిక అభివృద్ధిలో సహకరిస్తున్న దాతలకు నోటీసులు జారీ చేయడం విచారకరమని అన్నారు. దీనిపై కలెక్టర్‌కు వినతి పత్రం అందజేస్తామని వారు తెలిపారు. ఈ సమావేశంలో కౌన్సిలర్లు చిక్కాల సంతోష్‌కుమార్, సుమతిల తో పాటు బూర సత్తిబాబు, మజ్జి గణేష్‌మహంతి అప్పలనాయుడు, ఇడదీసి శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

నాగావళికి తరలివస్తున్న గుర్రపు డెక్క



తోటపల్లి స్పిల్‌వే ప్రాంతానికి చేరిన గుర్రపు డెక్క, వరద ప్రవాహం

గరుగుబిల్లి: తోటపల్లి ప్రాజెక్టు పరిధిలోని నాగావళి నదికి అధికంగా గుర్రపు డెక్క తరలివస్తోంది. ప్రస్తుతం ఒడిశాతో పాటు పరిసర ప్రాంతాల్లో కురుస్తున్న భారీ వర్షాలకు, వరద ప్రవాహంతో పాటు గుర్రపు డెక్క ప్రాజెక్టులోకి చేరుతుంది. ఆదివారం పైప్రాంతం నుంచి నదిలోకి సుమారు 1500 క్యూసెక్కుల వరద ప్రవాహం చేరుతుంది. ప్రధానంగా గుర్రపు డెక్క స్పిల్‌వేకు ఆనుకుని ఉన్న షట్టర్ల ప్రాంతంలో చేరడంతో సాగునీటికి కొంతమేర ఆటంకం కలుగుతుంది. నదీ ప్రాంతంలో గాలి అధికంగా వీయడంతో పాటు వరద ప్రవాహం నెలకుంటే అధికంగా గుర్రపు డెక్క స్పిల్‌వే మొత్తం ఆవహిస్తోంది. గుర్రపు డెక్క అధికంగా ఉన్న సమయంలో ప్రధాన గేట్లును ఎత్తివేసి నదిలోకి మళ్లింపు చేస్తున్నారు. ప్రస్తుతం వరద ప్రవాహం నిలకడగా ఉందని ప్రాజెక్టు అధికారులు తెలిపారు. సాగునీటి అవసరాలకు ఎడమ ప్రధాన కాలువ నుంచి 80 క్యూసెక్కులు, పాత కుడి కాలువ నుంచి 30 క్యూసెక్కుల నీరు విడుదల చేస్తున్నారు. ప్రాజెక్టులో 105 మీటర్లకుగాను 104.25 మీటర్ల నిల్వ ఉంది. అధికంగా వర్షాలు కురిసిన పక్షంలో ప్రాజెక్టు ప్రాంతంలో అప్రమత్తంగా ఉన్నామని ప్రాజెక్టు డీఈ టి.రఘునాథనాయుడు, జేఈలు కె.శ్రీనివాసరావు, బి.కిషోర్ తెలిపారు. అధిక ప్రవాహం నమోదైతే స్పిల్‌వే గేట్లు నుంచి దిగువకు మళ్లిస్తామని చెప్పారు.

బోరు మోటారును బాగుచేయండి



పాడైన బోరు మోటారు వద్ద నిరసన చేస్తున్న రాచవీధి నివాసితులు

పాచిపెంట: స్థానిక రాచవీధిలోగల బోరు మోటారును బాగుచేసి తాగునీటి ఇబ్బందులు తొలగించాలని ఆ ప్రాంత నివాసులు కోరారు. బోరు మోటారు మరమ్మతులకు గురై నెలలు గడిచిపోయినా సంబంధిత అధికారులు పట్టించుకోవడం లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. సీపీఎం జిల్లా కమిటీ సభ్యుడు కోరాడ ఈశ్వరరావు ఆధ్వర్యంలో ఆదివారం నిరసన కార్యక్రమం చేపట్టారు. సకాలంలో బోరు మరమ్మతులు చేపట్టకపోతే ఎంపీడీవో కార్యాలయం వద్ద ధర్నా చేస్తామని రాచవీధి వీధి ప్రజలు హెచ్చరించారు.

విభిన్న రూపాల్లో జగన్నాథుడు

పార్వతీపురంటౌన్: జిల్లా కేంద్రంలోని శ్రీజగన్నాథమిస్వామి రథయాత్రలో భాగంగా గుండిచా మందిరంలో ఆదివారం జగన్నాథుడు భక్తులకు శ్రీకృష్ణావతారంలో దర్శనమిచ్చాడు. ఉదయం 8 గంటల నుంచి రాత్రి 8 గంటల వరకు ఈవో ప్రసాదు ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అలాగే రథయాత్ర ఉత్సవాల్లో భాగంగా జిల్లా కేంద్ర ప్రజలు సుఖసంతోషాలతో జీవించాలని రుత్వికులు పూజలు చేశారు. ● **పాలకొండ:** పట్టణంలో జగన్నాథస్వామి రథోత్సవాలు ఘనంగా నిర్వహిస్తు న్నారు. స్వామివారు ఆదివారం కల్కీ అవతారంలో భక్తులకు దర్శనం ఇచ్చారు. తెల్లవారుజాము నుంచే ఆలయానికి భక్తులు చేరుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ ప్రధాన అర్చకుడు మఠం విశ్వనాథదాస్ భక్తులతో పూజలు చేయించారు. ఆలయ ఈవో సర్వేశ్వరరావు ఆధ్వర్యంలో ప్రత్యేక బారిగేడ్ల ద్వారా భక్తులకు స్వామివారి దర్శనానికి అనుమతి ఇచ్చారు.

నేడు మారు రథాయాత్ర

వీరఘట్టం: పట్టణంలో వెలిసిన శ్రీజగన్నాథస్వామివారి మారు రథోత్సవం (మారుదశమి) సోమవారం సాయంత్రం వైభవంగా నిర్వహిస్తున్నామని, భక్తులు యావన్మంది యాత్రను దిగ్విజయంగా పూర్తి చేయాలని ఆలయ ప్రధాన అర్చకుడు లింగరాజు ప్రసాద్‌రథో, గ్రామ పెద్దలు కోరారు.



పార్వతీపురంటౌన్: కృష్ణావతారంలో జగన్నాథుడు

రోడ్డుపైనే మురుగు

- అధికారులు పరిశీలించినా పరిష్కారం కాని సమస్య



మాధవబజార్ రోడ్డులో ప్రవహిస్తున్న మురుగు

రాజాం రూరల్: రాజాంలోని మాధవబజార్ లో మురుగునీటి ప్రవాహం కొనసాగుతోంది. బజార్‌లో నడకా నరకంగానే మారింది. కాలువలపై శాశ్వత నిర్మాణాల పుణ్యమాని మురుగునీరు పొంగి ప్రవహించడాన్ని తెలుసుకున్న కమిషనర్ రామ అప్పలనాయుడు.. ఈనెల 9న బజార్‌లో పర్యటించారు. కాలువలపై ఉన్న శాశ్వత నిర్మాణాలను పరిశీలించి, వ్యాపారులను ప్రశ్నించారు. వ్యాపారులు సహకరిస్తే ఆక్రమణలు తొలగించి మురుగునీరు సజావుగా ప్రవహించేలా చర్యలు తీసుకుంటామన్నారు. కుమ్మరి వీధి జంక్షన్ వద్ద రోడ్ కట్‌చేస్తే తప్ప సమస్య పరిష్కారం కాదని టీడీపీ పట్టణ అధ్యక్షుడు నంది సూర్యప్రకాశరావుతో పాటు పలువురు వ్యాపారులు కమిషనర్‌కు సూచించారు. సమస్య పరిష్కరించాలంటే కాలువలపై ఉన్న రెండు ఆక్రమణలను తొలగించాల్సి ఉందని గమనించిన కమిషనర్.. వాటిని ఈనెల 12లోగా తొలగించాలని ఆక్రమణదారులకు ఆదేశించారు. ఈనెల 13, 14 తేదీల్లో రోడ్ కట్‌చేసి మురుగునీటి సమస్య పరిష్కరిస్తామని ఆయన హామీ ఇచ్చారు. అయితే సమస్య మాత్రం యధావిధిగానే ఉంది. మురుగునీరు రోడ్డుపైనే ప్రవహించడంతో పాదచారులు, ద్విచక్ర వాహనదారులు అవస్థలకు గురవుతున్నారు.

జంగిల్ క్లియరెన్స్ చేయించాలి

వీరఘట్టం: నడుకూరు-వీరఘట్టం మధ్య రహదారిలో పిచ్చిమొక్కలు పెరిగి రోడ్డుమీదకే వచ్చేశాయి. దీంతో ప్రమాదాలు సంభవించే అవకాశం ఉందని వాహన చోదకులు భయాందోళన చెందుతున్నారు. అధికారులు స్పందించి రోడ్డుపక్కన జంగిల్ క్లియరెన్స్ చేయించాలని వాహనచోదకులు కోరుతున్నారు.



రోడ్డు పైకి వచ్చిన పిచ్చిమొక్కలు

ఈపీఎఫ్ పెన్షన్ పెంచాలి

గరివిడి: కార్మికుల భవిష్య నిధి పెన్షన్ రూ.9వేలకు పెంచాలని ఈపీఎఫ్ పెన్షనర్ల సంఘం జిల్లా బాధ్యులు కోరారు. ఈమేరకు ఎంపీ కలిశెట్టి అప్పలనాయుడుకు వినతిపత్రం ఇచ్చేందుకు ఆదివారం శ్రీకాకుళం జిల్లా రణస్థలంలోని ఆయన నివాసానికి వెళ్లారు. ఎంపీ అందుబాటులో లేకపోవడంతో ఆయన సతీమణికి తమ విజ్ఞాపన పత్రాన్ని అందజేశారు. అనంతరంలో ఎంపీతో ఫోన్‌లో మాట్లాడారు. ఈనెల 18 నుంచి జరగనున్న పార్లమెంట్ సమావేశాల్లో ఈపీఎఫ్ పెన్షన్ రూ.9వేలకు పెంచే విషయాన్ని ప్రస్తావించాలని వారు కోరారు. ఈపీఎఫ్ పెన్షనర్ల సంఘం జిల్లా బాధ్యులు అంబళ్ల గౌరినాయుడు, మండల నాయకులు ఓఎస్ఎన్ మూర్తి, బట్టా జగదీష్, కలిశెట్టి సూరప్పడు, గంట్యాడ అప్పలరాజు, తదితరులు పాల్గొన్నారు.

అరటి తోటలు ధ్వంసం చేసిన ఏనుగులు



ధ్వంసమైన అరటి పంటను పరిశీలిస్తున్న వీఆర్వో

గరుగుబిల్లి: మార్కొండపుట్టి నిర్వాసిత గ్రామంలో అరటి తోటలను ఏనుగులు ధ్వంసం చేశాయి. మరికొద్ది రోజుల్లో పంట చేతికందుతుందన్న సమయంలో ఇలా జరగడంతో రైతులు లబోదిబోమంటు న్నారు. ఈ విషయం తెలుసుకున్న గ్రామ రెవెన్యూ అధికారి ధనుంజయరావు ఆదివారం ఉదయం ఆ ప్రాం తాన్ని పరిశీలించారు. సుమారు 6 ఎకరాల అరటి పంట ను ఏనుగులు ధ్వంసం చేసినట్లు గుర్తించారు. పంట నష్టం వివరాలను తహసీల్దార్ కార్యాలయం అధికారులకు తెలియజేస్తామని ఆయన చెప్పారు. ఏనుగుల సంచారంలో గ్రామస్థులు పంట పొలాలకు వెళ్లేందుకు భయపడుతున్నారు. తక్షణమే ఈ ప్రాంతం నుంచి వాటిని తరలించాలని డిమాండ్ చేస్తున్నారు.

క్లుప్తంగా..

కేసులు వెనక్కి తీసుకోండి

సాలూరు: మాజీ ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డిపై పెట్టిన అక్రమ కేసులు వెంటనే వెనక్కి తీసుకోవాలని మాజీ ఉపముఖ్యమంత్రి పీడిక రాజన్నదొర కోరారు. సాలూరులోని తన నివాసంలో ఆదివారం ఆయన స్థానిక విలేకర్లతో సమావేశం ఏర్పాటుచేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎప్పుడో మూడు సంవత్సరాల కిందట జరిగిన విషయానికి తమ నాయకుడుపై అక్రమ కేసులు పెట్టడం సరికాదని అన్నారు. అందరూ న్యాయ సూత్రాలను, రాజ్యాంగాన్ని గౌరవించాలని కోరారు. ఈ కార్యక్రమంలో పలువురు వైసీపీ నాయకులు పాల్గొన్నారు.

యూటీఎఫ్ నాయకుడు మధు మృతి

గరివిడి: మండలంలోని తాటిగూడ ఉన్నత పాఠశాల హెచ్ఎం, యూటీఎఫ్ నాయకుడు పి.మధుసూదనరావు ఆదివారం కన్ను మూశారు. ఈయన గుండెపోటుకు గురై విజయనగరంలోని ఓ ప్రైవేటు ఆసుపత్రిలో చికిత్స పొందుతూ ఆదివారం మృతిచెందారు. హెచ్ఎం ఆకస్మిక మరణం పట్ల ఉపాధ్యాయ వర్గాలు కలత చెందాయి. ఆయన మృతికి పలువురు సంతాపం తెలిపారు.

దత్తిరాజేరులో నేత్ర వైద్య శిబిరం

దత్తిరాజేరు: దత్తిరాజేరు పీహెచ్‌సీలో ఆదివారం నేత్ర వైద్య శిబిరం నిర్వహించారు. ఆప్తమాలజిస్టు జేక్సన్, శంకర్ ఫౌండేషన్ సంస్థ ఆధ్వర్యంలో నిర్వహించిన ఉచిత నేత్ర వైద్య శిబిరంలో 75 మందికి తనిఖీలు చేశారు. వీరిలో 35 మందిని శస్త్ర చికిత్సలకు గుర్తించినట్టు తెలిపారు. రోగలకు తనిఖీల అనంతరం ఉచితంగా మందులు అందజేశారు.

సమతా సైనిక్‌దళ్ జిల్లా కార్యవర్గ సమావేశం



మాట్లాడుతున్న శ్రీనివాసరావు

రాజాం: సమతా సైనిక్‌దళ్ జిల్లా కార్యవర్గ సమావేశం ఆదివారం కంచరాం గ్రామంలో అయ్యప్ప కల్యాణ మండపంలో నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జిల్లా నియోజకవర్గ పరిధిలోని నాలుగు మండలాల కమిటీల ఎన్నిక విధి విధానాలపై చర్చించారు. ఈ సమావేశంలో నియోజకవర్గ మండల స్థాయి నాయకులు, కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు. పొందరంకి శ్రీనివాసరావు మాట్లాడుతూ సైనిక్‌దళ్ సభ్యులు పలు సేవా కార్యక్రమాలు నిర్వహించాలని కోరారు. ఈ కార్యక్రమంలో దేబారికి రామప్పుడు, రెయ్యి రామకృష్ణ, బొత్స బుద్ధుడు, సిమ్మాల దుర్గాప్రసాద్, రేగిడి రామకృష్ణ, తేగల మోహన్‌రావు, బత్తిన శంకర్, శ్రీను తదితరులు పాల్గొన్నారు.